
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
మంగళవారం, 20 మే 2025

ర్యాలీలో ఉద్రిక్తత
- బీజేపీ కార్యకర్తలకు, ఓ మతం వ్యక్తికి మధ్య వాగ్వాదం
- టూటౌన్ పోలీస్ స్టేషన్ వద్ద మోహరించిన ఇరువర్గాలు
- పోలీసుల సమక్షంలోనే ఘర్షణ వాతావరణం
- ఇరు వర్గాలపై కేసులు నమోదు చేశామన్న సీపీ సునీల్‌దత్ 6
- నేడు నగర బంద్‌కు బీజేపీ పిలుపు.. రానున్న బండి సంజయ్





మాజీ సైనికుడిని సన్మానిస్తున్న దృశ్యం



ర్యాలీలో పాల్గొన్న ప్రజలు

ఉప్పొంగిన జాతీయభావం

- ఖమ్మం నగరంలో ఉత్సాహంగా 'తిరంగా' ర్యాలీ
- 'ఆపరేషన్ సిందూర్', సైనిక దళాలకు మద్దతుగా నినాదాలు
- పెద్ద సంఖ్యలో పాల్గొన్న భిన్న వర్గాల ప్రజలు
- మాజీ సైనికులకు సత్కారం

ఖమ్మం స్పోర్ట్స్, మే 19 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా, భారత త్రివిధ దళాలకు సంఘీభావంగా సోమవారం నగరంలోని లకారం ట్యాంక్‌బండ్ వద్ద తిరంగా ర్యాలీ ఉత్సాహంగా కొనసాగింది. సర్దార్ పటేల్ స్టేడియం వరకు కొనసాగిన ఈ ర్యాలీలో యువత, జాతీయవాదులు, దేశాభిమానులు రాజకీయ పార్టీలకు అతీతంగా భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ర్యాలీలో భాగంగా ఔత్సాహికులు జాతీయ పతాకాలు, ఆపరేషన్ సిందూర్ ప్లకార్డులతో ఉవ్వెత్తున పాల్గొన్నారు. తిరంగా యాత్రా కమిటీ ఆధ్వర్యంలో డీజేలను ఏర్పాటు చేసి దేశభక్తి గీతాలతో ర్యాలీలో పాల్గొన్న యువతను ఉత్సాహపరిచారు. ర్యాలీలో భాగంగా జరిగిన సాంస్కృతిక కార్యక్రమంలో యువత నృత్యాలతో, పాటలతో అలరించారు. ఈ సందర్భంగా భారత మిలటరీకి అండగా మేమున్నాం అంటూ పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ (మిగతా 6వ పేజీలో)



ఖమ్మం లకారం ట్యాంక్‌బండ్ వద్ద చిన్నారి నృత్యం

నిబంధనలు తప్పక పాటించాలి...
- ఇందిరమ్మ ఇండ్లను పటిష్టంగా నిర్మించుకోవాలి
- ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్
- చిన్నగోపతిలో ఇండ్ల నిర్మాణాల పరిశీలన



చిన్నగోపతిలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

కొణిజర్ల, మే 19 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతిని అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని, లబ్ధిదారులకు ప్రతి దశలో ప్రభుత్వం నుంచి సహకారం అందించాలని ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అధికారులను ఆదేశించారు. మండలంలోని ఇందిరమ్మ ఇండ్ల పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు చేపట్టిన చిన్నగోపతి గ్రామాన్ని సోమవారం కలెక్టర్ సందర్శించారు. గ్రామంలో ఎంతమంది లబ్ధిదారులు ఇండ్లు కడుతున్నారని అధికారుల నుంచి తెలుసుకున్నారు. లబ్ధిదారుల దగ్గరకు వెళ్లి ఇసుక, సువ్వ వారు వాడే మెటీరియల్‌ను పరిశీలించారు. లబ్ధిదారుల సాధకబాధకాలను తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 20 మండలాల నుంచి ఒక్కో గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసినట్టు తెలిపారు. పైలట్ ప్రాజెక్టు గ్రామాల్లో 875 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశామన్నారు. ఆ ఇండ్లన్ని వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. పునాది పూర్తయిన ఇండ్లకు రూ.లక్ష, గోడలు పూర్తయిన తర్వాత రూ.1.25 లక్షలు, స్లాబ్ దశలో రూ.1.75 లక్షలు, నిర్మాణం పూర్తయిన తర్వాత రూ.లక్ష లబ్ధిదారుల ఖాతాలో జమ చేస్తామని లబ్ధిదారులకు తెలియజేశారు. పైలట్ ప్రాజెక్టుల్లో ఇండ్ల నిర్మాణం వేగం పెంచాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న కార్యక్రమం అని అధికారులు వ్యక్తిగత శ్రద్ధతో పని చేయాలన్నారు. లబ్ధిదారులకు (మిగతా 6వ పేజీలో)

కృష్ణా నదీ జలాలతో పాలేరు రిజర్వాయర్ నుంచి సాగర్ ఎడమకాలువకు ఇప్పటి వరకు సాగునీరు అందుతుండగా.. కృష్ణాతో సంబంధం లేకుండా మున్నేరు వరదనీటిని గ్రావిటీ ద్వారా పాలేరు రిజర్వాయర్‌కు తరలించడంతో ఆయకట్టు భూములు సస్యశ్యామలం కానున్నాయి.



మున్నేరు వృథా జలాలను పాలేరుకు మళ్లించే దుబ్బగూడెం చెక్‌డ్యాం ప్రాంతం

మున్నేరు వర(ద) ప్రదాయిని

- గ్రావిటీ ద్వారా పాలేరు జలాశయంలోకి వరద నీరు వచ్చేలా ప్లాన్
- గార్ల మండలం దుబ్బగూడెం వద్దగల చెక్‌డ్యామ్ నుంచి తరలింపు
- మంత్రి పొంగులేటి చొరవతో రూ.162.54 కోట్లు మంజూరు
- ప్రతీ వానాకాలంలో 10 టీఎంసీల నీటిని వాడుకునే యోచన
- సస్యశ్యామలం కానున్న పాలేరు ఆయకట్టు భూములు
- సాగర్, సీతారామ జలాలకు ప్రత్యామ్నాయం కానున్న మున్నేరు
- త్వరలో టెండర్ల ప్రక్రియ... భూసేకరణకు సన్నాహాలు

ఖమ్మం, మే 19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పాలేరు రిజర్వాయర్‌కు మున్నేరు వరద జలాలు అనుసంధానం కాబోతున్నాయి. ఇందుకు సంబంధించి నీటిపారుదల శాఖ చేసిన ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదం తెలపడం, పాలేరు ఎమ్మెల్యే, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టి రూ.162.54 కోట్లు మంజూరు చేయించారు. నీటిపారుదల శాఖ అధికారి ఇంజనీర్ రమేష్‌రెడ్డి పాలేరుకు ప్రత్యామ్నాయంగా మున్నేరు జలాల అనుసంధాన ప్రక్రియను చేసిన డిజైన్‌ను ప్రభుత్వం అంగీకరించడంతో త్వరలోనే టెండర్ల ప్రక్రియ నిర్వహించబోతున్నారు. ఇప్పటికే పాలేరుకు సీతారామ లింక్ కెనాల్ ద్వారా గోదావరి జలాలను అనుసంధానం చేసే పనులు జరుగుతున్నాయి. అయితే జూలూరుపాడు టన్నెల్ పూర్తయితేనే మూడు ఎత్తిపోతల ద్వారా గోదావరి జలాలు పాలేరుకు



పాలేరు రిజర్వాయర్

లభించే అవకాశం ఉంది. ఈ పనులు పూర్తి కావాలంటే మరో రెండు, మూడేళ్లు పట్టే పరిస్థితి ఉండడంతో ప్రత్యామ్నాయంగా మున్నేరు జలాలను గ్రావిటీ ద్వారా మళ్లించే అవకాశం ఉండడంతో ఇందుకు సంబంధించి డిజైన్ చేశారు.

గార్ల మండలం ములకనూరు సమీపంలోని దుబ్బగూడెం వద్ద మున్నేరుపై చెక్‌డ్యాం ఉంది. ఇది రెండున్నర నుంచి మూడు మీటర్ల వరకు ఎత్తు ఉంది. ఇక్కడి నుంచి (మిగతా 6వ పేజీలో)



అన్న, తమ్ముడిపై పిడుగుపాటు
- అన్న మృతి... తమ్ముడి పరిస్థితి విషమం
- ఇల్లెందు మండలం కట్టుగూడెంలో ఘటన

ఇల్లెందు రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి): వారిద్దరూ యువ రైతులు.. స్వయాన అన్నదమ్ములు.. కలిసి మెలిసి వ్యవసాయం చేస్తు బతుకుతున్నారు. ఇంతకాలం కలిసి మెలిసి ఉన్న ఆ అన్నతమ్ముళ్ల అనుబంధాన్ని పిడుగుపాటు వేరు చేసింది. కట్టుగూడెం గ్రామానికి చెందిన పరిటాల పుల్లయ్య(42) అతని సోదరుడు పరిటాల వెంకటేశ్వర్లు ఇరువురు కలిసి తమ ప్రక్క గ్రామమైన రేపల్లెవాడ గ్రామసమీపంలో ఇటీవలనే కొంత వ్యవసాయ భూమి కొనుగోలు చేశారు. అన్నతమ్ముడు ఇద్దరు ఆ భూమిలో బావి తీస్తుండగా ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కుడిన వర్షం వచ్చింది. ఈ క్రమంలో వారు ఇరువురు సమీపంలో ఉన్న చెట్టు కిందకు వెళ్లగా ఒక్కసారిగా చెట్టుపై పిడుగుపడింది. పిడుగుపాటుతో (మిగతా 6వ పేజీలో)

బదిలీల జోరు
- భద్రాద్రి జిల్లాలో 15మంది తహసీల్దార్లకు స్థానచలనం 6

'పాతబస్తీ' ఘటనతోనైనా
పాఠాలు నేర్చేనా!?
- అగ్ని ప్రమాదంలో 17 మంది మృత్యువాతతో కలకలం
- జిల్లాలో అగ్నిమాపక నిబంధనలు పాటించని భవనాలెన్నో...
- పాఠశాలలు, వ్యాపార సముదాయ భవనాల్లో పొంచి ఉన్న ప్రమాదం 6



ఆదివాసీ ఆణిముత్యం
- స్టెనో నుంచి సీఎంపీఎఫ్ రీజనల్ కమిషనర్ స్థాయికి ఎదిగిన మట్టా కనకమ్మ
- గిరిజన సంక్షేమ హాస్టళ్లలో సాగిన విద్యాభ్యాసం
- స్వస్థలం.. మారుమూల అటవీ గ్రామం పెద్ద నల్లబల్లి 6
- గిరిజన విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తున్న మహిళ



మహోన్నతుడు
సుందరయ్య

- సమ సమాజంకోసం జీవితాన్ని అంకితం చేశారు
- ఆయన ఆశయాల సాధనకు పునరంకితం కావాలి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ
- కుర్నవల్లిలో ఘనంగా 40వ వర్ధంతి సభ



ప్రదర్శనలో అభివాదం చేస్తున్న జాన్‌వెస్లీ

తల్లాడ, మే 19 (ఆంధ్రజ్యోతి): సమసమాజ స్థాపన కోసం జీవితాన్ని అంకితం చేసిన కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య జీవితం ప్రజా ఉద్యమాలకు స్ఫూర్తిదాయకమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. సుందరయ్య 40వ వర్ధంతి సభ తల్లాడ మండలం కుర్నవల్లి గ్రామంలో సోమవారం రాత్రి జరిగింది. సభలో జాన్‌వెస్లీ మాట్లాడుతూ సుందరయ్య కమ్యూనిస్టులకే కాకుండా అన్నివర్గాల వారికి ఆదర్శమన్నారు సమాజంలోని కులవివక్ష, అంటరానితనం, అసమానతలు లేని అంతరాలులేని సమసమాజంకోసం జీవితాన్ని అంకితం చేసిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. పార్లమెంట్‌కు సైకిల్‌పై వెళ్లి నిరాడంబర జీవితం గడిపారన్నారు. నేటి ప్రజానాయకులకు, సుందరయ్య మార్గదర్శకుడిగా నిలిచారని తెలిపారు.

సుందరయ్య అవిశ్రాంత పోరాట యోధుడని స్వాతంత్ర ఉద్యమంలో కీలకపాత్ర పోషించారని భూమి, భుక్తి, పేద ప్రజల విముక్తికోసం జరిగిన చరిత్రాత్మక తెలంగాణ సాయుధ పోరాటానికి నాయకత్వం వహించిన ధీరుడన్నారు. భారత కమ్యూనిస్టు ఉద్యమంలో సుందరయ్యది అజరామర చరిత్ర అన్నారు. అంతర్జాతీయ వాదానికి సుందరయ్య జాతీయస్ఫూర్తి అని, ప్రపంచీకరణ పేరుతో జరిగే ఆర్థిక వలసవాదం దేశాన్ని కబళిస్తున్న తరుణంలో సుందరయ్య లాంటి నేతల అవసరం స్పష్టమవుతుందన్నారు. సుందరయ్య జీవితం విప్లవ ప్రజాతంత్ర ఉద్యమాలకు ఎంతో బలం ఇస్తుందన్నారు. సుందరయ్య జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని ప్రజా ఉద్యమాలను బలోపేతం చేసేందుకు సీపీఎం నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు.

భారీ ప్రదర్శన

సుందరయ్య వర్ధంతి సందర్భంగా సోమవారం రాత్రి కుర్నవల్లిలో సీపీఎం (మిగతా 6వ పేజీలో)

గిరిజనుల 'పంట' పడేనా?

- 'ఇందిర సౌర గిరి జల వికాసం'తో పోడు భూములకు సాగునీరు
- ఆర్థికంగా బలపడేలా ప్రభుత్వం నూతన పథకం
- పథకం అమలులో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు అధిక ప్రాధాన్యం
- ఐదేళ్లలో జిల్లా వ్యాప్తంగా 1.96 లక్షల ఎకరాలకు సాగునీరు లక్ష్యం
- పైలెట్ ప్రాజెక్టుగా చంద్రుగొండ మండలం ఎంపిక
- నాగూర్‌కర్నూల్ జిల్లాలో పథకానికి శ్రీకారం చుట్టిన సీఎం రేవంత్‌రెడ్డి

కొత్తగూడెం, మే 19 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతాల్లో నిరుపేదల రైతులకు చెందిన రికార్డు ఆఫ్ ఫారెస్ట్ రైట్స్ (ఆర్‌వోఎఫ్ఆర్) పట్టా భూముల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ఇందిర సౌర గిరి జలవికాసం పథకంపై భద్రాద్రి జిల్లాలోని గిరిజన రైతులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించిన ఈ పథకంతో తమ భూములు సస్యశ్యామలమవుతాయని ఆశిస్తున్నారు. రాష్ట్రంలోనే అతిపెద్ద గిరిజన జిల్లాగా ఉన్న భద్రాద్రి కొత్తగూడెంలో గిరిజనుల రైతులు అత్యధికంగా పోడు సాగు చేస్తూ ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాలు పొంది ఉన్నారు. దాంతో ఇందిర సౌర గిరి జలవికాసం పథకం అమలులో రాష్ట్ర ప్రభుత్వం భద్రాద్రి జిల్లాకు అధిక ప్రాధాన్యత ఇస్తోంది.

ఐదేళ్లలో 1.96లక్షల ఎకరాల్లో సాగు..

జిల్లా వ్యాప్తంగా రానున్న ఐదేళ్లలో 1.96 లక్షల ఎకరాల్లో (మిగతా 6వ పేజీలో)



ఇందిర సౌర గిరి జల వికాస పథకం ట్రయల్ రన్

బొమ్మ బంద్..

- జూన్ 1నుంచి నిలిచిపోనున్న సినిమాల ప్రదర్శన
- పర్సంటేజీ కోరుతున్న థియేటర్ యాజమాన్యాలు

ఖమ్మం సాంస్కృతికం, మే 19 (ఆంధ్రజ్యోతి): ఎగ్జిబిటర్లు సమ్మెకు దిగనుండటంతో ఖమ్మం నగరంతోపాటు జిల్లా వ్యాప్తంగా సినిమాహాళ్లు బంద్ కానున్నాయి. జూన్ 1వ తేదీనుంచి సమ్మెకు దిగాలని సినీ ఎగ్జిబిటర్లు రాష్ట్రస్థాయిలో పిలుపునివ్వటంతో స్థానిక థియేటర్లు అదే బాట పట్టనున్నాయి. ఖమ్మం నగరంలో ప్రస్తుతం అయిదు సినిమాహాళ్లు నడుస్తుండగా జిల్లా వ్యాప్తంగా మరో 15 థియేటర్లు ఉన్నాయి. గతంలో ఖమ్మంలోనే పదికి పైగా సినిమాహాళ్లతో కళకళలాడగా క్రమేణా థియేటర్లు మూతపడి అయిదుకు చేరాయి. ఓటీటీల్లో సినిమాలను తిలకించే సంస్కృతి అధికం కావటంతో సినిమాహాళ్లు ప్రేక్షకులు లేక వెలవెలపోతున్నాయి.

సినిమాహాళ్లను నడిపే విషయంలో అద్దెకు, తెగే టిక్కెట్లకు పొంతన కుదరక పోతుండటంతో నగరంలో నడుస్తున్న సినిమాహాళ్లను సైతం నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లకు లీజుకు ఇచ్చారు. సినిమాల ప్రదర్శనకు సంబంధించి డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లకు మధ్య సమస్య పరిష్కారం కాక పోతుండటంతో మూసివేత నిర్ణయానికి పిలుపునిచ్చారు. ప్రస్తుతం సినిమా డిస్ట్రిబ్యూటర్లు థియేటర్ల యాజమాన్యానికి రోజుకు ఇంత అన్న అద్దె ప్రాతిపదికన సినిమాలను ప్రదర్శింప చేస్తున్నారు. కాగా ఎగ్జిబిటర్లు పర్సంటేజీని డిమాండ్ చేస్తున్నారు.

ఎంతకాలం నష్టాలు భరించగలం

కాంపాటి పిచ్చయ్య, థియేటర్ యజమాని

అద్దె ప్రాతిపదికన సినిమా హాళ్లు నడిపించటం కంటే బజ్జీల బండి వేసుకోవటం నయం.. కొంతమంది సినిమా హాళ్లను అమ్మేసుకోవాలనుకుంటున్నారు. మరికొందరు పెద్ద సంస్థలకు లీజుకు ఇచ్చారు. డిస్ట్రిబ్యూటర్లు చెల్లిస్తున్న అద్దెలకు థియేటర్లకు అవుతున్న ఖర్చులకు పొంతన ఉండటం లేదు. పెద్ద సినిమాలు విడుదలైనప్పుడు వచ్చే అధిక కలెక్షన్లను నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు సొమ్ము చేసుకుంటున్నారు.

నెట్‌బాల్‌లో జిల్లా జట్ల ప్రతిభ

ఖమ్మం స్పోర్ట్స్, మే 19(ఆంధ్రజ్యోతి): జనగాంలో జరిగిన సబ్ జూనియర్ రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలలో ట్రెడిషనల్ విభాగంలో జిల్లా బాలురు, బాలికల జట్లు సత్తా చాటి తృతీయ బహుమతి సాధించగా ఫాస్ట్-5 విభాగంలో జిల్లా బాలురు, బాలికల జట్లు ద్వితీయ బహుమతిని కైవసం చేసుకున్నాయి. బాలుర జట్టు నుంచి స్నేహిత్, హాసిత్, సాకేత్, సంజయ్, నేహాల్, సూర్య బాలికల జట్టు నుంచి అవంతిక, హారిణి, రితికసహస్ర, సింధు త్వరలో మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ప్రాబబుల్స్‌గా ఎంపిక కావడం విశేషం. ఈ సందర్భంగా రాష్ట్ర పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను నెట్‌బాల్ సంఘం జిల్లా బాధ్యులు ఫణికుమార్, దీప్తి, రమణ తదితరులు అభినందించారు.

అన్న, తమ్ముడిపై పిడుగుపాటు

(5వ పేజీ తరువాయి)

చెట్టు కింద ఉన్న అన్న పరిటాల పుల్లయ్య అక్కడికక్కడే మృతి చెందగా, పక్కనే ఉన్న తమ్ముడు వెంకటేశ్వర్లు అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. ఇది గమనించిన స్థానిక రైతులు వెంకటేశ్వర్లును హుటాహుటిన ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి వైద్యసేవలు అందిస్తున్నారు. మృతి చెందిన పుల్లయ్యకు భార్య లలిత, ప్రణయ్, చరణ్ అనే కుమారులు ఉన్నారు. పుల్లయ్య మృతితో కట్టుగూడెం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

'పాతబస్తీ' ఘటనతోనైనా పాఠాలు నేర్చేనా!?

అగ్నిప్రమాదంలో 17 మంది మృత్యువాతతో కలకలం

జిల్లాలో అగ్నిమాపక నిబంధనలు పాటించని భవనాలెన్నో...

భద్రాచలం, మే 19 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని పాతబస్తీ గుల్జార్ హౌజ్ సమీపంలోని భవనంలో జరిగిన అగ్ని ప్రమాదంలో 17మంది చనిపోవడం రాష్ట్రంలో సంచలనంగా మారింది. ఒక్కసారిగా పాత భవనాలు, అగ్నిమాపక నిబంధనలు పాటించని భవనాలపై ప్రభుత్వం దృష్టిసారించింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇటీవల కాలంలో పుట్టగొడుగుల్లా బహుళ అంతస్తు భవన నిర్మాణాలు చోటు చేసుకుంటున్నాయి. వాటిలో అగ్నిమాపక శాఖ ఇచ్చే సూచనలను కనీసం పాటించని భవనాలు ఎన్నో ఉన్నాయనే విమర్శలు ఉన్నాయి. మునిసిపాలిటీ, గ్రామ పంచాయతీ అధికారుల పర్యవేక్షణ, తనిఖీలు లేకపోవడంతో భవన నిర్మాణాల సమయంలోనే అగ్నిమాపక శాఖ నిబంధనలు పాటించకుండా నిర్మాణాలు పూర్తి చేస్తున్నారు.

ముఖ్యంగా పర్యాటక ప్రాంతమైన భద్రాచలంలోని రామాలయం పరిసరాల్లో నిర్మించే లాడ్జీల్లో కనీసం ఏదైనా అగ్ని ప్రమాదం సంభవిస్తే అగ్నిమాపక శకటంతో మంటలను ఆర్పే సౌకర్యం కూడా సరిగా లేకుండా నిర్మాణాలు పూర్తి చేస్తున్నారనే విమర్శలున్నాయి. కాసులు వెనకేసుకోవడానికి లాడ్జీల యజమానాలు ప్రాధాన్యత ఇస్తున్నారు తప్ప.. అగ్ని ప్రమాదం సంభవిస్తే తీసుకోవాల్సిన రక్షణాత్మక చర్యలకు అనుగుణంగా నిర్మాణాలు లేవని సమాచారం. కాగా గ్రామ పంచాయతీ అధికారులు సైతం పట్టించుకోవడం లేదని భక్తులు ఆరోపిస్తున్నారు. అగ్నిమాపక శాఖ నిబంధనలను సైతం తుంగలో తొక్కి నిర్మాణాలను కొనసాగిస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతం కావడంతో అడ్డూ అదుపు లేకుండా భవన నిర్మాణాలు కొనసాగుతున్నాయి.

నిబంధనలు పాటించని భవనాలెన్నో...

పాతబస్తీ సంఘటన నేపథ్యంలో జిల్లాలోని కొత్తగూడెం, పాల్వంచ, భద్రాచలం, ఇల్లెందు, మణుగూరు తదితర ప్రాంతాల్లో అనేక పాత భవనాలు ఉన్నాయి. అలాగే కొత్తగా నిర్మించే భవనాల్లో సైతం అగ్నిమాపక శాఖ నిబంధనల ప్రకారం ర్యాంపు, స్టేర్ కేస్‌లు ఏర్పాటు చేయాలి. కాని అలాంటి నిబంధనలు ఎక్కడ పాటించిన దాఖలాలు కనిపించడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. భవనాల్లో ఏదైనా అగ్ని ప్రమాదం సంభవిస్తే నివారణ చర్యలు చేపట్టేందుకు సైతం అంతగా అవకాశం లేకుండానే అనేక భవనాలు ఉన్నాయి. జిల్లా అగ్నిమాపక శాఖ అధికారులు వీటిపై ప్రధాన దృష్టిసారించి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఆ సముదాయాల సంగతేంటి

జిల్లాలో భద్రాచలం, పాల్వంచ, కొత్తగూడెం లాంటి పట్టణాల్లో కార్పొరేట్ పాఠశాలలు, వ్యాపార సముదాయాలు ఎక్కువగా వెలుస్తున్నాయి. షాపింగ్ కాంప్లెక్సులను అద్దెకు తీసుకొని వాటిలో మార్పులు చేసి నడుపుతుండటంతో అగ్ని ప్రమాదాలు సంభవిస్తే ఎలా అనేది ఎవరికి పట్టడం లేదు. అగ్నిమాపక శాఖ అధికారులు సైతం భవనాలను క్షేత్రస్థాయిలో పరిశీలించడం, తగిన అగ్ని ప్రమాద నివారణ పద్ధతులు పాటించేలా చూడటంపై దృష్టిసారించకపోవడం గమనార్హం. ఏదైనా ప్రమాదం జరిగితే తప్ప అధికార యంత్రాంగం స్పందించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

మహోన్నతుడు సుందరయ్య

(5వ పేజీ తరువాయి)

ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని సినిమా థియేటర్ వద్ద నుంచి బొడ్రాయి సెంటర్ వరకు సుమారు 2కి.మీ. మేర ప్రదర్శన నిర్వహించారు. ప్రదర్శనలో ప్రత్యేక వాహనం నుంచి జాన్‌వెస్లీ ప్రజలకు అభివాదం చేశారు. ప్రదర్శనలో మహిళల కోలాట నృత్యాలు, డప్పు కళాకారుల వాయిద్యాలు, బాణసంచా కాలుస్తూ పార్టీ శ్రేణులు పాల్గొన్నాయి. సుందరయ్య చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు మాచర్ల భారతి, కళ్యాణం వెంకటేశ్వరరావు, తాత భాస్కరరావు, సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణరెడ్డి, మండల కార్యదర్శి అయినాల రామలింగేశ్వరరావు, నాయకులు శీలం ఫకీరమ్మ, జనార్ధన్, దర్గయ్య, నల్లమోతు మోహన్‌రారావు, చల్లా నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌ఫెడ్‌పై దుష్ప్రచారం తగదు

పామాయిల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆలపాటి రాంచంద్రప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న ఆలపాటి

దమ్మపేట, మే19 (ఆంధ్రజ్యోతి): కొందరు కావాలనే రాజకీయ దురుద్దేశ్యంతోనే ఆయిల్‌ఫెడ్, పామాయిల్ మొక్కలు, వ్యవసాయశాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావుపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని పామాయిల్ సంక్షేమసంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆలపాటి రాంచంద్రప్రసాద్ ఆరోపించారు. అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీ ఆవరణలో పామాయిల్ రైతులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్‌పాం సాగులో 38వేల మంది రైతులు సుమారుగా మూడులక్షల టన్నుల పామాయిల్ పండిస్తున్న పామాయిల్ సాగుపై రైతుల భవిష్యత్‌ను దెబ్బతీసేవిధంగా కొందరు సోషల్ మీడియాలో చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తీవ్రంగా ఖండించారు. ఆయిల్‌పాం సాగును 30సంవత్సరాలుగా రైతులు సాగు చేస్తూ అభివృద్ధి చెందారని పామాయిల్ తోటల్లో అక్కడక్కడ కొద్దిగా కనిపించే పామాయిల్ ఆఫ్‌టైప్ మొక్కలను (కల్లింగ్ మొక్కలు) పేరుతో ఆయిల్ ఫెడ్‌ను దెబ్బతీసేవిధంగా సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాన్ని చేయటం వల్ల పాయిల్‌సాగు ప్రశార్ధకంగా మారుతుందని దీంతో రైతులకు నష్టం జరుగునుందని తప్పుడు ప్రచారం మానుకోవాలన్నారు. ఆయిల్‌ఫెడ్‌తో రైతులు అభివృద్ధి చెందారని, ఆయిల్‌పెడ్ వల్ల ప్రైవేటు కంపెనీలకు నష్టం జరుగుతుందని దీనిని దెబ్బ తీసేవింగా ప్రయత్నాలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. తెలంగాణాలోని అప్పారావుపేట ఫ్యాక్టరీలో వచ్చిన ఓఈఆర్‌తోనే ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాలకు పామాయిల్ ధర నిర్ణయం జరుగుతుందని అన్నారు. వ్యవసాయశాఖా మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుండి తుమ్మల నాగేశ్వరరావు పామాయిల్ రైతులకు మేలు చేసే విధంగా కృషి చేస్తున్నారని అన్నారు. పామాయిల్ ధర పడిపోవటంతో కేంద్రప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకువెళ్లి దిగుమతి సుంకం పెంచే విధంగా కృషి చేయటంతో పామాయిల్ ధర పెరిగిందని అన్నారు. ఈసమావేశంలో రైతులు దొడ్డా ప్రసాదు, కంది మళ్ల కృష్ణారావు, గుత్తా రాజ ఆళ్ల జంగం, మాజీ ఎంపీపి రైతు సోయం ప్రసాదు, మొగళ్లపు చెన్నకేశవరావు, మన్నెం అప్పారావు, బొల్లికొండ నాగేశ్వరరావు, కరటూరి కృష్ణ, మేకల వెంకటేశ్వర్లు, దొడ్డా చిన్నసత్యం, దొడ్డా భాస్కరరావు పాల్గొన్నారు.

ఆదివాసీ ఆణిముత్యం

- స్టెనో నుంచి సీఎంపీఎఫ్ రీజనల్ కమిషనర్ స్థాయికి ఎదిగిన మట్టా కనకమ్మ
- గిరిజన సంక్షేమ హాస్టళ్లలో సాగిన విద్యాభ్యాస్యం
- స్వస్థలం.. మారుమూల అటవీ గ్రామం పెద్ద నల్లబల్లి

కొత్తగూడెం టౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ హాస్టళ్లలో విద్యాభ్యాసం చేసి చిరుద్యోగిగా ప్రస్థానం మొదలుపెట్టిన ఆదివాసీ మహిళ మట్టా కనకమ్మ... సీఎంపీఎఫ్ (కోల్‌మైన్స్ ప్రావిడెంట్ ఫండ్) రీజనల్ కమిషనర్‌గా ఎదిగి ఎందరికో ఆదర్శంగా నిలిచారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం మారుమూల గ్రామమైన పెద్ద నల్లబల్లిలో జన్మించి అక్కడి నుంచి తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. భద్రాచలంలో పదో తరగతి వరకు చదివి కాకినాడలో పాలిటెక్నిక్ చేసి సీఎంపీఎఫ్ కార్యాలయంలో 1988లో స్టెనోగా విధుల్లో చేరారు. ఆ తర్వాత సెక్షన్ ఆఫీసర్‌గా, సూపర్‌వైజర్‌గా, ఇన్‌స్పెక్టర్‌గా, అసిస్టెంట్ కమిషనర్‌గా, రీజనల్ కమిషనర్‌గా ఎదిగారు.

చిన్నతనం నుంచే ఎన్నో కష్టాలు అనుభవిస్తూ విద్యాభ్యాసం చేసిన కనకమ్మ ఉన్నతంగా ఎదిగి ఆదివాసీ వర్గాలకు మార్గదర్శిగా నిలిచారు. బొగ్గుగని కార్మికులు, కాంట్రాక్టు కార్మికులకు సంబంధించి పెన్షన్లు, సీఎంఎఫ్‌కు సంబంధించిన కేసులను పరిష్కరించడంలో కీలకపాత్ర పోషిస్తున్నారు. సింగరేణి కాలరీస్ పరిధిలోని ఇల్లెందు, కొత్తగూడెం, మణుగూరు, కొత్తగూడెం కార్పొరేట్ పరిధిలోని సుమారు 15వేల మంది కార్మికులు, 6వేల మందిపైగా కాంట్రాక్టు కార్మికులకు సంబంధించిన పెన్షన్లు, సీఎంపీఎఫ్ లావాదేవీలను పర్యవేక్షిస్తున్నారు. సింగరేణిలో పని చేసి పదవీ విరమణ చేసిన సుమారు 50 వేల మంది కార్మికుల పెన్షన్ల కార్యకలాపాలను పర్యవేక్షించడంతోపాటు ఇబ్బందులు తలెత్తితే పరిష్కరించే విధంగా చొరవ చూపుతూ కార్మికుల మన్ననలు పొందుతున్నారు. గత నాలుగేళ్లుగా రీజనల్ సీఎంపీఎఫ్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న కనకమ్మ... ఫిర్యాదుదారుల సమస్యలను పరిష్కరించడంలో కీలకపాత్ర పోషిస్తున్నారు. కార్మికులు రుణాలకు దరఖాస్తు చేస్తే ఎలాంటి పైరవీలకు అవకాశం లేకుండ ఎడ్యుకేషన్ రుణాలు, హౌసింగ్ రుణాలు, పెళ్లిళ్లకు రుణాలను ఇప్పించడంలో శ్రమిస్తున్నారు. కనకమ్మ సోదరుడు మిడియం బాబురావు వైద్యుడిగా భద్రాచలం పార్లమెంట్ సభ్యుడిగా పని చేశారు.

నేటి నుంచి ఉపాధ్యాయులకు

రెండో విడత శిక్షణ

ఖమ్మం ఖానాపురంహవేలి, మే 19(ఆంధ్రజ్యోతి): రెండో విడత ఉపాధ్యాయ శిక్షణ తరగతులు మంగళవారం నుంచి ప్రారంభంకానున్నాయని, ఈశిక్షణ ఈ నెల 24 వరకు నిర్వహిస్తున్నట్లు డీఈవో కె. సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయిలో మూడు సెంటర్లు, మండల స్థాయిలో 21 సెంటర్లలో శిక్షణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నగరంలోని హార్వెస్ట్ పాఠశాల, న్యూఇరా పాఠశాల, న్యూవిజన్ పాఠశాలల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

22 నుంచి ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలు

ఖమ్మం ఖానాపురంహవేలి, మే 19(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలు ఈ నెల 22 నుంచి 29 వరకు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కె. రవిబాబు సోమవారం తెలిపారు. ఈ పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ప్రథమ సంవత్సరం విద్యార్థులకు, మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఖమ్మం జిల్లాలో 38 పరీక్షా కేంద్రాలలో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 11,780, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 3,680 మంది పరీక్షలకు హాజరవుతున్నట్లు తెలిపారు. సీసీ కెమేరాల నిఘాలో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేస్తారని తెలిపారు. మాల్ ప్రాక్టీస్ జరగకుండా రెండు ఫ్లైయింగ్ స్క్వాడ్స్ ఆరు సిట్టింగ్ స్క్వాడ్స్ బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సోమవారం పరీక్షల నిర్వాహణ పై అధికారులతో సమావేశం నిర్వహించారు.

మున్నేరు వర(ద) ప్రదాయిని

(5వ పేజీ తరువాయి)

గ్రావిటీ ద్వారా పాలేరు రిజర్వాయర్‌కు మున్నేరు వరద జలాలు రానున్నాయి. ప్రస్తుతం సీతారామ పాలేరు లింక్‌కెనాల్ కింద నిర్మిస్తున్న 15 ప్యాకేజీ కెనాల్ పనులకే ఈ గ్రావిటీ కెనాల్ అనుసంధానం చేయబోతున్నారు. ఈ సీతారామ కాలువలో ప్యాకేజీ 16లో టన్నెల్ పనులు కూడా చేపట్టాల్సి ఉంది. ములకనూరు చెక్‌డ్యాం నుంచి 9.65కి.మీ. పొడవున కెనాల్ నిర్మించబోతున్నారు. 12మీటర్ల వెడల్పు, 6మీటర్ల ఎత్తులో నిర్మించే ఈ గ్రావిటీ కెనాల్ చెక్‌డ్యాంకు 4 మీటర్ల దిగువన ఉంది. దీంతో సులభంగా మున్నేరు వరదనీటిని పాలేరుకు మళ్లించే సౌలభ్యం ఉంది.

ప్రతిఏటా 30 నుంచి 40 టీఎంసీల వరద నీరు ప్రవహిస్తుంది. గత వర్షాకాలంలో వచ్చిన వరదల్లో రోజుకు 5 లక్షల క్యూసెక్కుల నీరు మున్నేరులో గోదావరి వరద వలే ప్రవహించింది. ఈ వృథా జలాలు దిగువన ప్రాజెక్టులు లేకపోవడంతో వృథాగా కృష్ణాలో కలిసి సముద్రం పాలవుతున్నాయి. ఈ పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని ములకనూరు చెక్‌డ్యాం నుంచి మున్నేరుకు గ్రావిటీ ద్వారా 9.65కి.మీ. గ్రావిటీ కెనాల్‌తో సుమారు 10 టీఎంసీల నీటిని పాలేరుకు తరలించనున్నారు. 22 టీఎంసీలకు పైగా సాగర్ ఆయకట్టుకు పాలేరు రిజర్వాయర్ నుంచి వినియోగిస్తున్నారు. జూన్, జూలై, ఆగస్టులో కురిసే వర్షపు నీరును 10 టీఎంసీలు మున్నేరు నుంచి పాలేరుకు తీసుకోవడం ద్వారా పాలేరు రిజర్వాయర్‌పై కృష్ణాజలాల వినియోగ భారం తగ్గనుంది.

వర్షాకాలంలో కృష్ణాలో ఎగువన కురిసే వర్షాలతో కర్ణాటకలోని తుంగభద్ర, ఆల్మట్టి, ఏపీలోని శ్రీశైలం, ఆ తర్వాత నల్గొండ జిల్లాలోని నాగార్జునసాగర్ రిజర్వాయర్లు నిండిన తర్వాతనే ఎడమకాలవ ద్వారా పాలేరుకు నీరు చేరుతుంది. ఎగువున వర్షాలు లేకపోతే కృష్ణాలో నీరు లేక కరువు పరిస్థితులు నెలకొంటున్నాయి. ముందుగానే మున్నేరు నుంచి వరద జలాలను పాలేరుకు మళ్లించడం ద్వారా జూన్, జూలైలోనే పాలేరుకు నీరు చేరే అవకాశం ఉంటుంది. తద్వారా పాలేరు ఎడమకాలవ కింద పాలేరు నియోజకవర్గంతోపాటు సాగర్ ఎడమకాలవ నుంచి కూడా నీరు విడుదల చేసే అవకాశం లభించనుంది. ఒకవైపు సీతారామతో గోదావరి జలాలు సాగర్‌కాలువకు వైరా ప్రాజెక్టుకు అనుసంధానం అవుతున్న నేపథ్యంలో మున్నేరు గ్రావిటీ కెనాల్ ద్వారా సీతారామ పాలేరు లింక్ కెనాల్‌ను అనుసంధానం చేయడంతో పాలేరు నియోజకవర్గం కూడా మున్నేరు వరద జలాలతో సస్యశ్యామలం కానుంది.

భూసేకరణకు సన్నాహాలు

మున్నేరు గ్రావిటీ కెనాల్‌కు టెండర్లు చేపడుతున్నందున ఇందుకు సంబంధించిన భూ సేకరణ కూడా వేగవంతం చేస్తున్నారు. వచ్చే ఏడాది జూన్ నాటికి పనులు పూర్తి చేయాలన్నా లక్ష్యంతో నీటిపారుదలశాఖ టెండర్ల ప్రక్రియ నిర్వహిస్తోంది. భూసేకరణకు 150ఎకరాలు అవసరం ఉంది. ఈ మున్నేరు గ్రావిటీ కెనాల్‌తో డోర్నకల్ నియోజకవర్గంలోని పది, చెరువులకూ సాగునీరు అందించనున్నారు. ఇదే క్రమంలో మున్నేరు, ఆకేరు అనుసంధానం అయ్యేచోట వరదజలాలను నిల్వ చేసేందుకు రిజర్వాయర్‌కు కూడా నీటిపారుదల శాఖ ప్రతిపాదనలు సిద్ధం చేస్తుంది. సీతారామ పాలేరు లింక్‌కెనాల్‌ను సద్వినియోగం చేస్తూ మున్నేరు వృథా జలాలను వినియోగిస్తూ మున్నేరు గ్రావిటీ కెనాల్ ద్వారా పాలేరుకు మున్నేరు జలాల తరలింపుతో పాలేరు నియోజకవర్గంతోపాటు ఇతర సాగర్ కాలువ ఆయకట్టు కూడా సస్యశ్యామలం కానుందని నీటిపారుదలశాఖ అధికారులు సూచిస్తున్నారు. టెండర్ల ప్రక్రియను త్వరితగతిన చేపట్టి పనులు పూర్తి చేయడం జరుగుతుందని ఇరిగేషన్ డిప్యూటీ డీఈ రమేష్‌రెడ్డి ఆంధ్రజ్యోతికి తెలిపారు. మున్నేరు గ్రావిటీ కెనాల్ ద్వారా సాగు, తాగునీటికి ఎంతో ప్రయోజనం చేకూరనుందని వివరించారు.

బదిలీల జోరు

కొత్తగూడెం, మే 19 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 15మంది తహసీల్దార్లు బదిలీ అయ్యారు. దమ్మపేట తహసీల్దార్‌గా బి.భగవాన్‌రెడ్డి, అశ్వరావుపేట తహసీల్దార్‌గా ఎల్.వీరభద్రం, సుజాతనగర్ తహసీల్దార్‌గా వి.కృష్ణ ప్రసాద్, బూర్గంపాడు తహసీల్దార్‌గా జి.శిరీష, కరకగూడెం తహసీల్దార్‌గా జి.ప్రతాప్ బదిలీ అయ్యారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్‌లో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా అనంతరామకృష్ణ, అన్నపురెడ్డిపల్లి తహసీల్దార్‌గా జి.పుల్లారావు, భద్రాచలం తహసీల్దార్‌గా డి.జగదీశ్వర ప్రసాద్, జూలూరుపాడు తహసీల్దార్‌గా టి.శ్రీనివాస్, ములకలపల్లి తహసీల్దార్‌గా బి.గన్యా, మణుగూరు తహసీల్దార్‌గా ఎ.నరేష్ బదిలీ అయ్యారు. కలెక్టరేట్‌లో ఎల్ఆర్ అధికారిగా స్వాతిబిందు, భద్రాచలంలోని ఆర్డీవో కార్యాలయంలో డీఏవోగా ఎస్.రాజేంద్రనాథ్, పినపాక నాయబ్ తహసీల్దార్‌గా పనిచేస్తున్న పి.సమ్మయ్యకు అక్కడే ఇన్‌చార్జి తహసీల్దార్‌గా, టేకులపల్లి నాయబ్ తహసీల్దార్‌గా పని చేస్తున్న పి.ముత్తయ్యను అక్కడే ఇన్‌చార్జి తహసీల్దార్‌గా నియమించారు.

ఇద్దరు ఏసీపీలకు స్థానచలనం

ఖమ్మం ఖానాపురంహవేలి, మే 19(ఆంధ్రజ్యోతి): ఖమ్మం కమిషనరేట్‌లో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు ఏసీపీలను బదిలీ చేస్తూ పోలీస్ శాఖ ఉన్నతాధికారులు సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఖమ్మం స్పెషల్ బ్రాంచ్ విభాగంలో ఏసీపీగా ఉన్న ఎన్. వెంకటేశ్‌ను వరంగల్ జిల్లా మామునూరు డివిజన్ ఏసీపీగా నియమిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సీపీఆర్బీ ఏసీపీగా ఉన్న పి. రవీందర్‌రెడ్డిని వరంగల్ జిల్లా నర్సంపేట డివిజన్ ఏసీపీగా నియమిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా వీరి స్థానంలో ఖమ్మం కమిషనరేట్‌కు ఇంకా ఎవరిని నియమించలేదు.

ఉప్పొంగిన జాతీయభావం

(5వ పేజీ తరువాయి)

ముందుకు సాగారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు మాట్లాడుతూ పహల్గాం ఘటనలో ఆడపడుల ఐదోతనాన్ని తుడిచి వేసిన ఉగ్రవాదంపై ప్రధాని నరేంద్ర మోదీ ఆపరేషన్ సిందూర్ పేరుతో చేసిన యుద్ధం పాకిస్థాన్‌కు చెంప పెట్టు లాంటిదని ఇంతటి ధైర్య సాహసాలను ప్రదర్శించి ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతం చేసిన భారత మిలటరీకి, ప్రధాని మోదీకి అండగా మేమున్నాం అని అన్నారు. ఉగ్రవాదానికి, పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు, రాష్ట్ర నాయకులు సన్నె ఉదయ్‌ప్రతాప్, తిరంగా యాత్రా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ర్యాలీలో ఉద్రిక్తత

బీజేపీ కార్యకర్తలకు, ఓ మతం వ్యక్తికి మధ్య వాగ్వాదం

ఖమ్మం, మే 19 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా, భారత త్రివిధ దళాలలకు సంఘీభావంగా సోమవారం సాయంత్రం బీజేపీ ఆధ్వర్యంలో ఖమ్మం నగరంలో చేపట్టిన తిరంగా ర్యాలీలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. ర్యాలీ కొనసాగుతున్న క్రమంలో బీజేపీ కార్యకర్తలకు, ఓ మతానికి చెందిన వ్యక్తికి మధ్య వాగ్వివాదం చోటు చేసుకోగా... అది కాస్త చిలికి చిలికి గాలివానలాగా మారడంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. వివరాల్లోకి వెళ్తే.. ఖమ్మంలోని లకారం ట్యాంక్‌బండ్ నుంచి సర్దార్ పటేల్ స్టేడియం వరకు తిరంగా ర్యాలీ చేపట్టారు. ఖమ్మం టూ టౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలోకి ర్యాలీ వచ్చిన సందర్భంలో ట్రాఫిక్ కానిస్టేబుల్‌ను ఓ మతానికి చెందిన వ్యక్తి ర్యాలీ ఎందుకంటూ ప్రశ్నించాడు. దీంతో అతడికి, బీజేపీ కార్యకర్తలకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అదికాస్తా మతపరమైన వాగ్వాదంగా ప్రచారం జరగడంతో ఇరువర్గాల వారు పెద్దఎత్తున గుమిగూడటంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. ఈ క్రమంలో పోలీసులు కలుగజేసుకుని ఇరువర్గాలకు చెందిన నేతలను, సదరు వ్యక్తి మతానికి చెందిన పెద్దలను పిలిపించారు. జరిగిన ఘటనలో నిజానిజాలను నిగ్గుతేల్చి ఎవరితప్పు ఉంటే వారిపై కేసు నమోదు చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఇరువర్గాల వారు శాంతించారు. ర్యాలీలో చోటుచేసుకున్న ఘటన ఉద్రిక్తతకు దారితీయడం నగరంలో చర్చనీయాంశంగా మారింది. కాగా ఈ ఘటనకు నిరసనగా బీజేపీ మంగళవారం ఖమ్మం బంద్‌కు పిలుపునివ్వగా, ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి, బీజేపీ జాతీయ నేత బండి సంజయ్ హాజరుకానున్నట్లు సమాచారం.



ఖమ్మం టూ టౌన్ పోలీస్ స్టేషన్ వద్ద మోహరించిన పోలీసులు

రెండు వర్గాలపై కేసులు

ఖమ్మంలో తిరంగ ర్యాలీ సందర్భంగా చోటుచేసుకున్న ఘటనకు సంబంధించి రెండు వర్గాలపై ఖమ్మం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో రెండు వేర్వేరు కేసులు నమోదు చేసినట్టు పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ తెలిపారు. సోమవారం సాయంత్రం నగరంలో ర్యాలీ జరుగుతున్న సమయంలో ఓ వర్గానికి చెందిన ఇద్దరు యువకులు జడ్పీ సెంటర్ నుంచి ఖానాపురం హవేలి వైపు మోటారుసైకిల్‌పై ప్రయాణిస్తున్నారనీ, ఆ సమయంలో ఇల్లెందు క్రాస్ రోడ్ వద్ద విధుల్లో వున్న ట్రాఫిక్ కానిస్టేబుల్ కొద్దిసేపు ఆగాలని వారికి విజ్ఞప్తి చేశారన్నారు. కానీ సదరు యువకులు తాము అత్యవసర పనితో వెళ్తన్నామని చెప్పి ట్రాఫిక్ కానిస్టేబుల్‌తో వాగ్వివాదానికి దిగారన్నారు. ఈ క్రమంలో ర్యాలీలో ఉన్న కొందరు యువకులు ట్రాఫిక్ కానిస్టేబుల్‌కు మద్దతుగా యువకులతో వాదనకు దిగడంతో తోపులాటకు దారితీసిందన్నారు. సంఘటన జరిగిన వెంటనే బందోబస్తులో ఉన్న పోలీసులు అక్కడకు చేరుకుని బీజేపీ సభ్యులను ఖమ్మం టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారని తెలిపారు. దీనికి సంబంధించి రెండు వర్గాలపై ఖమ్మం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో రెండు వేర్వేరు కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. పోలీసులు ఘటనపై దర్యాప్తు చేపట్టారని, అందరూ సమన్వయం పాటించాలని కోరారు. ర్యాలీ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకపోయినప్పటికీ కొంతమంది ఉద్దేశపూర్వకంగా సామాజిక మాధ్యమాల్లో వదంతులు ప్రచారం చేస్తున్నారని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీపీ తెలిపారు.

గిరిజనుల 'పంట' పడేనా?

(5వ పేజీ తరువాయి)

పంటలు పడించేందుకు ఈ పథకాన్ని వర్తింపచేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ముందుగా పైలెట్ ప్రాజెక్టు కింద చంద్రుగొండ మండలాన్ని ఎంపిక చేశారు. ఈ ఐదేళ్ల కాలంలో రూ.12,600కోట్లు ఈ పథకం కింద ఖర్చు చేయాలని నిర్ణయించారు. ఈ పథకంలో అర్హులైన గిరిజనులకు సోలార్ పంపులను అందిస్తారు. 100శాతం సబ్సిడీతో రూ.6లక్షల వ్యయంతో ఒక్కో యూనిట్‌ను మంజూరు చేస్తారు. ఈ రూ.6లక్షలతో భూమి అభివృద్ధి, ఆఫ్‌గ్రిడ్ సోలార్ పంప్, నీటి పారుదల వ్యవస్థ ఏర్పాటు, డ్రిప్ ఇరిగేషన్‌తో ఉద్యానవన తోటల పెంపకాన్ని చేపట్టనున్నారు. జిల్లాలో గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూములను సారవంతం చేసేందుకు ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని చంద్రుగొండ మండలంలోని పలు గ్రామాలను ఈ పథకం కింద ఎంపిక చేశారు. జిల్లా వ్యాప్తంగా ఈ ఐదేళ్లలో 66,342 మంది రైతులకు చెందిన రూ.1.60లక్షల ఎకరాల పోడు భూమిని సాగులోకి తేవడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను 2,921మంది రైతులకు చెందిన 8,046 ఎకరాల్లో ఇందిర సౌర గిరి జల వికాసం పథకాన్ని ఏర్పాటు చేయనున్నారు. అదేవిధంగా 2026-27 ఆర్థిక సంవత్సరానికి 14,856మంది రైతులకు చెందిన 46,988ఎకరాలు, 2027-28 సంత్సరానికి 14,856 రైతులకు చెందిన 46,988 ఎకరాలు, 2028-29 సంవత్సరానికి గాను 14,856మంది రైతులకు చెందిన 46,988 ఎకరాలు, 2029-30 సంవత్సరానికి గాను 14,856 మంది రైతులకు చెందిన 46,988 ఎకరాలకు ఈ పథకాన్ని అమలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

పథకం అమలు ఇలా..

ఈ పథకం అమలుకు రాష్ట్ర ప్రభుత్వం విధివిధానాలను రూపొందించింది. రెండున్నర ఎకరాలు ఉన్న రైతును సింగిల్ యూనిట్‌గా గుర్తిస్తారు. అంతకంటే తక్కువగా ఉన్న రైతులను ఒక గ్రూపుగా ఏర్పాటు చేస్తారు. దీనికోసం 25వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించి అర్హులైన రైతులను గుర్తిస్తారు. జిల్లా స్థాయిలో ఈ నెల 30నాటికి సర్వే నిర్వహిస్తారు. ఇతర పనులు, టెండర్లు ఖరారు చేసి జూన్ 25 నాటికి ఎంపిక చేసిన ప్రాంతాల్లో పనులు ప్రారంభిస్తారు. జూన్ 26 నుంచి మార్చి 31వరకు ఆ భూముల అభివృద్ధి, బోరుబావుల తవ్వకం, సోలార్ పంపుసెట్ల ఏర్పాటు, ఇతర పనులు పూర్తి చేస్తారు. జిల్లాస్థాయిలో ఈ పథకాన్ని అమలు చేసేందుకు కలెక్టర్ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. ఇప్పటికే ఈ పథకాన్ని చంద్రుగొండ మండలంలో పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి ఆ మండలంలోని బెండాలపాడు, రావికంపాడు గ్రామాల్లో సోలార్ పంపుసెట్లను అమర్చి ట్రయల్‌రన్ నిర్వహిస్తున్నారు. పోడు భూములు, హక్కుపత్రాలు కలిగిన గిరిజన రైతులకు పూర్తిస్థాయిలో 100శాతం సబ్సిడీతో ఈ పథకం అందుతుంది.

పోడు భూములు సస్యశ్యామలం

ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజన రైతులు ఎన్నో ఏళ్లుగా అటవిని నరికి పోడు వ్యవసాయం చేస్తున్నారు. ఆ భూములకు సాగునీరు లేక పంటలు పండక వారికి సరైన జీవనోపాధి లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఆర్‌వోఎఫ్ఆర్ పట్టా భూముల సమగ్ర అభివృద్ధి కోసం ఇందిర సౌర గిరి జలవికాసం పేరుతో ఈ పథకాన్ని రూపొందించి గిరిజన రైతులకు లాభసాటి పంటలు వేసుకునేలా పథకాన్ని రూపొందించారు. ఈ పథకం ద్వారా ప్రభుత్వం రూ.6లక్షలతో ఉచితంగా సౌర విద్యుత్ పంపుసెట్‌తో పాటుగా బోరుబావిని తవ్వించి భూమిని సమగ్రంగా అభివృద్ధి చేసి పంటలు పండించుకునేందుకు ఈ పథకం తోడ్పాటు ఇస్తుంది.

నిబంధనలు తప్పక పాటించాలి...

(5వ పేజీ తరువాయి)

సలహాలు సూచనలు ఇస్తూ వారికి సహకరించాలని తెలిపారు. కార్యక్రమంలో హౌజింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, డీపీవో రాంబాబు, ఇన్‌చార్జి తహసీల్దార్ రాము, హౌజింగ్ డీఈ సాయిరాంరెడ్డి, ఏఈ ఉమామహేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో ఆడపిల్లల పట్ల ఉన్న వివక్ష పూర్తిస్థాయిలో తొలగించేలా కేజీబీవీ విద్యార్థునులంతా జీవితంలో గొప్ప విజయాలు సాధించాలని, రాబోయే రోజుల్లో ఆడపిల్లలకు, వారి తల్లిదండ్రులకు రోల్‌మోడల్‌గా ఎదగాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆకాంక్షించారు. సోమవారం కలెక్టర్ మండలంలోని బస్వాపురం కేజీబీవీ పాఠశాలలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరాన్ని సందర్శించారు. విద్యార్థినులు రూపొందించిన పెయింటింగ్‌లు, కాగితపు బొకేలు, వస్తువులను పరిశీలించి వారిని అభినందించారు. ఈ సందర్భంగా కేజీబీవీలో ఉన్న సమస్యలను కలెక్టర్ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అనంతరం పది, ఇంటర్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కలెక్టర్ శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి సామినేని సత్యనారాయణ, కేజీబీవీ జిల్లా కో ఆర్డినేటర్ తులసి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఖమ్మం రూరల్, మే 19(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఖమ్మం రూరల్ మండలం, వరంగల్‌క్రాస్ రోడ్డులో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం పట్టణానికి చెందిన ఈగలపాటి శంకర్‌రావు (59) తన స్వగ్రామం కూసుమంచి మండలం, జక్కేపల్లికి వెళ్లి తిరిగి తన ద్విచక్రవాహనంపై ఖమ్మం వస్తుండగా వరంగల్‌క్రాస్ రోడ్డు వద్దకు రాగానే వెనుక నుంచి అతివేగంగా వచ్చిన లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన శంకర్‌రావు అక్కడికక్కడే మృతి చెందాడు. అన్నం శ్రీనివాస్ సహాయంతో మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వడదెబ్బకు గురై ఇద్దరు...

వైరా, మే 19 (ఆంధ్రజ్యోతి): వడదెబ్బకు గురై మహిళ మృతిచెందిన సంఘటన వైరాలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వైరా మునిసిపాలిటీలోని తొమ్మిదోవార్డు లీలాసుందరయ్యనగర్‌లో వడదెబ్బతో రేకుల ముత్తమ్మ(49)సోమవారం మృతి చెందింది. ఈనెల 15న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని చంద్రుగొండ మండలం రవికంపాడు వెళ్లిన ముత్తమ్మ ఈనెల 17న ఇంటికి వచ్చింది. అప్పటి నుంచి తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందినట్లు మృతురాలి భర్త శంకర్‌రావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

విద్యాశాఖ కాంట్రాక్టు ఉద్యోగి....


వెంకటకృష్ణారావు(ఫైల్)

చింతకాని, మే 19(ఆంధ్రజ్యోతి): వడదెబ్బతో విద్యాశాఖ కాంట్రాక్టు ఉద్యోగి కవికొండల శ్రీనివాస వెంకటకృష్ణారావు (57) సోమవారం మృతి చెందాడు. చింతకాని మండల వనరుల కేంద్రంలో గత 12ఏళ్ల నుంచి మృతుడు కృష్ణారావు ఐఈఆర్పీగా విధులు నిర్వహిస్తున్నాడు. రెండు రోజుల క్రితం వడదెబ్బకు గురవడంతో కుటుంబ సభ్యులు ఖమ్మం నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. నాటి నుంచి చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. దివ్యాంగ విద్యార్థులకు సేవలు అందించిన కృష్ణారావు మృతి బాధాకరమని ఎంఈవో రామారావు, పలు ఉపాధ్యాయ సంఘాలు తమ సంతాపాన్ని తెలియజేశారు.

మరిది వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య

పాల్వంచ, మే 19 (ఆంధ్రజ్యోతి): మరిది వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై పాల్వంచ టౌన్ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. సుజాతనగర్‌కు చెందిన బత్తుల త్రివేణి(32) గత నాలుగు రోజుల క్రితం పాల్వంచ దివ్యాంగుల కాలనీలోని తన పుట్టింటికి వచ్చింది. కాగా సోమవారం మధ్యాహ్నం మేడపైనున్న రేకులషెడ్డులో ఉరేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కొంతసేపటి తరువాత కుటుంబ సభ్యులు గమనించి ఆమెను పాల్వంచ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందిందని నిర్ధారించారు. తన కుమార్తెకు వరుసకు మరిది అయిన బత్తుల నాగరాజు వేధింపుల వల్లనే తన కుమార్తె ఆత్మహత్యకు పాల్పడిందని త్రివేణి తండ్రి చల్లా శివ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. చింతకానిలో బెటాలియన్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న నాగరాజు తన కుమార్తె ప్రైవేట్ ఫొటోలు, వీడియోలను వారి స్నేహితులకు పంపుతూ తన వేధించాడని, అందుకే ఆమె ఆత్మహత్యకు పాల్పడిందని, అతడిపై తగిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నాడు. శివ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ ఎస్ఐ సుమన్ తెలిపారు. మృతురాలికి భర్త ఉన్నాడు.

పురుగుల మందు తాగి మహిళ..

అశ్వాపురం, మే19(ఆంధ్రజ్యోతి): మతి స్తిమితం లేని మహిళ క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..అశ్వాపురానికి చెందిన సారంగి సరోజిని(60) అనే మహిళ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఈనేపథ్యంలో మతి స్తిమితం కూడా కోల్పోయింది. సోమవారం ఇంట్లో ఉన్న క్రిమిసంహారక మందు సేవించింది. గమనించిన కుటుంబసభ్యులు ఆమెను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ మధుప్రసాద్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీతారాంపురంలో విషాదఛాయలు


తాడ్వాయి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

అశ్వాపురం, మే19(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సీతారాంపురం ఎస్టీ కాలనీలో సోమవారం విషాదఛాయలు అలుముకున్నాయి. ఎస్టీకాలనీకి చెందిన పలు కుటుంబాల వారు మేడారం సమ్మక్క-సారలమ్మ వనదేవతల దర్శనానికి వెళ్లివస్తూ ఆదివారం రాత్రి ములుగు జిల్లా తాడ్వాయి వద్ద వీరు ప్రయాణిస్తున్న ట్రాక్టర్‌ను తాడ్వాయి జాతీయరహదారిపై ఇసుకలారీ ఢీకొట్టిన సంగతి తెలిసిందే. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా, పలువురు గాయపడ్డారు. ఈ ప్రమాదంలో గ్రామానికి చెందిన ఉప్ప దుర్గ(38), చేతుపల్లి సీత(40)లు మృతి చెందారు. గాయపడిన వారు ములుగు, తాడ్వాయి ప్రభుత్వ ఆస్పత్రు ల్లో చికిత్స పొందుతున్నారు. వీరిలోకూడా ఒకరిద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. కాగా ఆనందంతో బంధుమిత్రులతో కలసి వనదేవతల దర్శనానికి వెళ్లి సంతోషంగా ఇంటికి తిరిగివస్తున్న సమయంలో లారీ రూపంలో మృత్యువు కబళించడంతో కుటుంబ సభ్యులు కన్నీంటిపర్యంతమయ్యారు. కాగా మృతదేహాలను సోమవారం స్వగ్రామానికి తీసుకురావడంతో రోదనలు మిన్నంటయ్యాయి. రోడ్డు ప్రమాద ఘటనపై మంత్రి ధనసరి సీతక్క తీవ్ర ద్రిగ్భాంతిని వ్యక్తం చేశారు. బాధితులకు మెరుగైన వైద్యసౌకర్యాలు అందించాలని అధికారులను ఆదేశించారు.

బెల్టుషాపులో 60మద్యం బాటిళ్ల స్వాధీనం

వైరా, మే 19 (ఆంధ్రజ్యోతి): వైరాలోని ఒక బార్ నుంచి నిబంధనలకు విరుద్ధంగా స్టేజీ పినపాకలోని ఒక బెల్టుషాపునకు సరఫరా చేసిన 60మద్యం క్వార్టర్ బాటిళ్లను ఎక్సైజ్ అధికారులు ఆదివారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. వైరా రిజర్వాయర్ రోడ్డులో ఉన్న ఆర్కే బార్ నుంచి రూ.ఏడువేల విలువైన 60మద్యం బాటిళ్లను స్టేజీ పినపాకలోని బెల్టుషాపునకు సరఫరా చేయడంతో సమాచారం మేరకు ఎక్సైజ్ సిబ్బంది దాడిచేసి వాటిని స్వాధీనం చేసుకున్నారు.

ఎలక్ట్రికల్ దుకాణంలో షార్ట్ సర్క్యూట్

» రూ.10లక్షల విలువైన పరికరాల దగ్ధం

ఖమ్మం రూరల్, మే 19(ఆంధ్రజ్యోతి): ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని ఆటోనగర్‌లోని ఓ ఎలక్ట్రికల్ దుకాణంలో షార్ట్ సర్క్యూట్ అయిన సంఘటన సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దుకాణంలో నుంచి పొగలు రావడం గమనించిన స్థానికులు దుకాణం యజమానికి సమాచారం అందించారు. అప్పటికే దుకాణంలో ఉన్న స్పేర్‌పార్ట్స్ పరికరాలు కాలిపోయాయి. రూ.10 లక్షల వరకు నష్టం ఉంటుందని యజమాని పల్లపు వీరబాబు తెలిపారు. ప్రమాదం జరిగిన దుకాణాన్ని విద్యుత్ శాఖ అధికారులు పరిశీలించారు. ఈ దుకాణానికి విద్యుత్ మీటర్ లేకపోవడంతో పక్క దుకాణం నుంచి విద్యుత్ వాడుకుంటున్నారు. షార్ట్ సర్క్యూట్ జరిగి ఉంటుందని ఏఈ ప్రభాకర్‌రావు తెలిపారు. దుకాణం యజమాని పల్లపు వీరబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు పక్కకు దూసుకెళ్లిన వాహనం

● మూడు వాహనాలు ధ్వంసం

బూర్గంపాడు, మే 19(ఆంధ్రజ్యోతి): అదుపుతప్పి ట్రాలీ వాహనం రోడ్డు పక్కకు దూసుకెళ్లిన ఘటన సోమవారం మోరంపల్లిబంజరలో చోటుచేసుకుంది. ఈ ప్రమాదంతో మూడు ద్విచక్ర వాహనాలు ధ్వంసం అయ్యాయి. బూర్గంపాడు మండల పరిధిలోని మోరంపల్లిబంజర గ్రామపంచాయతీ కార్యాలయం సమీపంలో సోమవారం పాల్వంచ వైపు నుంచి బూర్గంపాడు వైపునకు వెళ్తున్న ట్రాలీ వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. ఈ క్రమంలో రోడ్డు పక్కన నిలిపి ఉంచిన మూడు ద్విచక్ర వాహనాలపై నుంచి వెళ్లడంతో పూర్తిగా ధ్వంసమయ్యాయి. ప్రమాద సమయంలో స్థానికులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ప్రమాదానికి డ్రైవర్ మద్యం మత్తులో ఉండటమే కారణమని స్థానికులు తెలిపారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు.

కొలతల్లో తేడా వస్తే అంతే..

» ఇందిరమ్మ ఇళ్ల పథకంలో కృతిమమేధతో అక్రమాలకు అడ్డుకట్ట.. » నిబంధనలకు విరుద్ధంగా 12 ఇళ్ల నిర్మాణాల గుర్తింపు



కొత్తగూడెం, మే 19 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ వేగవంతం చేయాలని గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మేనెలలో సచివాలయం నుంచి చీఫ్ సెక్రటరీ కె. రామకృష్ణరావుతో కలిసి భూభారతి, ఇందిరమ్మ ఇళ్ల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో వీసీ నిర్వహించారు. ప్రతి నియోజకవర్గంలో 3500ఇళ్లు కేటాయిస్తున్నామని, ప్రతి నియోజకవర్గంలో పట్టణ ప్రాంతాల్లో కనీసం 500ఇళ్లు కేటాయించి లబ్ధిదారులను ఎంపికచేయాలని స్పష్టం చేశారు. మొదటి విడతలో మండలానికి ఎంపికచేసిన గ్రామాన్ని మినహాయించి మిగతా గ్రామాల్లో రెండో విడత జాబితాను అధికారులు తయారుచేస్తున్నారు. అనర్హులని తేలితే ఇళ్ల నిర్మాణం మధ్యలో ఉన్నా కూడా రద్దు చేస్తామని, జాబితా-1, జాబితా-2, జాబితా-3లతో సంబంధం లేకుండా నిరుపేదలను ఎంపికచేయాలని స్పష్టం చేశారు. ఇల్లు మంజూరైతే లబ్ధిదారులు తప్పనిసరిగా 400 చదరపు అడుగుల విస్తీర్ణం, 600లకు మించకుండా విస్తీర్ణంలోనే ఇల్లు నిర్మాణం చేపడితే బిల్లులు చెల్లిస్తారు.

భద్రాద్రి జిల్లాలో 3,200 ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభం

భద్రాద్రికొత్తగూడెం జిల్లాకు 3,200ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణపనులు ప్రారంభం అయ్యాయి. ఇందిరమ్మ ఇల్లు నిర్మాణంలో ఎలాంటి అక్రమాలు జరగకుండా ఉండేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. గతంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో జరిగిన అవకతవకలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ఈసారి ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. "ఇళ్లకు ముగ్గు పోసినప్పటి నుంచి బేస్‌మెంట్, స్లాబ్, గోడలు, ప్లాస్టింగ్ పూర్తయిన తర్వాత ఇలా వివిధ దశల్లో ఆయాప్ ద్వారా నిర్మాణ తీరుతెన్నులను పోటోలు తీసి అధికారులు అప్‌లోడ్ చేస్తారు." ముగ్గు పోసినప్పుడు తీసిన లోకేషన్‌కు, తర్వాత వివిధ దశల్లో తీసిన లోకేషన్‌కు సరిపోలితేనే బిల్లులు వస్తాయని అధికారులు చెబుతున్నారు.

భద్రాద్రి జిల్లాలో 3,200 ఇళ్లు మంజూరు

ఇందిరమ్మ ఇళ్ల పథకంలో లబ్ధిదారుల ఎంపిక, బిల్లుల మంజూరులో అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేధ) సాంకేతికత కీలక భూమిక పోషిస్తుంది. ఇందిరమ్మ యాప్‌లో తప్పుడు సమాచారం ఎంటర్ చేస్తే గుర్తిస్తుంది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మొదటివిడతదలో జిల్లాకు 3200 ఇళ్లకు అనుమతులు ఇచ్చారు. అనుమతులు పొందినవారు నిర్మాణపనులు ప్రారంభించారు. వీటిల్లో ఇళ్లకు సంబంధించి పునాది వరకు పనులు పూర్తయినట్లు అన్‌లైన్‌లో ఎంటర్‌చేశారు. మొదటి దశ బిల్లుల మంజూరులో అప్‌లోడ్ చేసిన వివరాలను అధికారులు కృత్రిమ మేధ సాంకేతికతతో పరిశీలిస్తున్నారు.

ఇళ్ల దరఖాస్తుదారులకు సంబంధించిన 360 డిగ్రీల సమాచారం యాప్‌లో పొందుపర్చారు. క్షేత్రస్థాయిలో లబ్ధిదారుని వివరాలు, పనులు, పరిస్థితులపై యాప్‌లో వివరాలు ఎంటర్‌కాగానే ఏఐ వాటిని పరిశీలిస్తుంది. భిన్నంగా కనిపిస్తే వెంటనే ఏఐ సాంకేతికత గుర్తిస్తుంది. దీని ఆధారంగా అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి విచారణ జరుపుతారు.

జిల్లాలోని భద్రాచలంలో మంజూరు అయిన 12ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన పునాదులు పూర్తయినట్లు బిల్లుల కోసం అన్‌లైన్‌లో వివరాలు, ఫొటోలను బిల్‌కలెక్టర్ అప్‌లోడ్ చేశారు. యాప్‌లో పొందుపర్చిన వివరాలతో తేడా ఉన్నట్లు ఏఐ గుర్తించడంతో అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించగా.. ఆ ఇళ్ల పునాది నిర్మాణాలు పూర్తికాలేదని గుర్తించారు. అన్‌లైన్‌లో తప్పుడు ఫొటోలు అప్‌లోడ్ చేసిన సంబంధిత బిల్ కలెక్టర్‌ను విధుల నుంచి తొలగించారు. ఈ విషయమై గృహ నిర్మాణశాఖ పీడీ శంకర్‌నాయక్‌ను వివరణకోరగా నిజమేనని ధ్రువీకరించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్మాణపనులు చేపడితే ఇందిరమ్మ బిల్లులు మంజూరు అవుతాయని స్పష్టం చేశారు.

ఏఈలకు ఒక యాప్..

మండలాల్లో గ్రామ పంచాయతీ సెక్రటరీలకు ఒక యాప్ ఇవ్వగా.. వారు నిర్మాణదశలో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల ముగ్గు పోసిన పోటోలను తీసి ఇప్పటికే అప్‌లోడ్ చేశారు. తాజాగా టెక్నికల్ గా ఇళ్లు నిర్మిస్తే కొలతల ప్రకారం నిర్మాణం చేపడుతున్నారా..? లేదా ..? అని దానిపై ధ్రువీకరించేందుకు ఈ ఇళ్లకు సంబంధించిన ఏఈలకు ఒక యాప్‌ను ఇచ్చారని తెలిసింది. ఏఈలు బేస్‌మెంట్ వరకు పూర్తయిన ఇళ్లను పరిశీలించి వాటి కొలతలు తీసుకుని సరిగా ఉంటేనే ఫోటో అప్‌లోడ్ చేస్తారు. డీఈలు సూపర్‌చెక్ చేసి సరిగా ఉంటే బిల్లులు చెల్లింపునకు గ్రీన్ సిగ్నల్ ఇస్తారు. నిర్ణీత కొలతల ప్రకారం లేని ఇళ్లను నిరభ్యంతరంగా తిరస్కరిస్తారు. లబ్ధిదారులు సరిచేసుకుంటే పునః పరిశీలనకు అవకాశం ఉంది.

పనులు ప్రారంభించపోతే అనుమతులు రద్దు..

మొదటివిడతలో ఇందిరమ్మ ఇల్లు మంజూరైన లబ్ధిదారుల్లో నిర్మాణపనులు ప్రారంభించని వారితో గ్రామాల్లో సమావేశాలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వీరిలో ఇళ్ల నిర్మాణానికి అసక్తి చూపని వారి నుంచి లిఖితపూర్వకంగా అమోదం తీసుకుని వారి ఇంటి అనుమతులు రద్దు చేయాలని అధికారులకు మార్గదర్శకాలు జారిచేసినట్లు తెలిసింది. రద్దు చేసిన ఇళ్లను రెండో విడత జాబితాలో అర్హులకు కేటాయించేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

ఉద్యమ నిర్మాణంలో కీలకంగా పనిచేసిన పుచ్చలపల్లి

» సీపీఎం జిల్లా కమిటీ కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు


సుందరయ్య విగ్రహానికి పూలదండ వేస్తున్న నున్నా నాగేశ్వరరావు

ఖమ్మం సంక్షేమ విభాగం, మే 19(ఆంధ్రజ్యోతి): దక్షిణ భారత దేశంలో కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణంలో కమ్యూనిస్టు యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య తన జీవితకాలంలో క్రమశిక్షణతో పనిచేశారని సీపీఎం జిల్లా కమిటీ కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు పేర్కొన్నారు. సుందరయ్య 40వ వర్థంతి సందర్భంగా ఖమ్మం జిల్లా వ్యాప్తంగా సీపీఎం జెండావిష్కరణ కార్యక్రమాలు నిర్వహించారు. ప్రస్తుతం దేశంలో రగులుతున్న విద్వేష రాజకీయాలను ప్రజలు గమనించాలని పిలుపునిచ్చారు. పుచ్చలపల్లి సుందరయ్య భవిష్యత్ తరాలకు కూడా ఆదర్శంగా ఉంటారన్నారు. ఉత్తమ పార్లమెంటీరయన్‌గా అనేక అవార్డులు పొందారని గుర్తు చేశారు. ప్రజల కోసం తుది శ్వాస వరకు పనిచేశారన్నారు. శ్రమను గౌరవించే సమాజం రావాలని పుచ్చలపల్లి సుందరయ్య ఆకాంక్షించారన్నారు. పలు రాజకీయ ప్రతికూల పరిస్థితుల్లోను కార్యకర్తలకు అండగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో సోమయ్య, పొన్నం వెంకటేశ్వరరావు, సుబ్బారావు, మాచర్ల భారతి, కళ్యాణం వెంకటేశ్వరరావు, వై విక్రమ్, మెరుగు సత్యనారాయణ, బండారు రమేశ్, తుమ్మ విష్ణువర్ధన్, మెరుగు రమణ, పగడాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు 17గొర్రెల మృత్యువాత


మృతి చెందిన గొర్రెలు

కారేపల్లి, మే19(ఆంధ్రజ్యోతి): పిడుగుపాటుకు గురై 17 గొర్రెలు మృత్యువాత పడిన సంఘటన మండల పరిధిలోని బాజుమల్లాయిగూడెం గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన మద్దెల లక్ష్మయ్య, అతని భార్య లక్ష్మీతో కలిసి తమ జీవాలను గ్రామం సమీపంలో మేతకుతీసుక వెళ్లారు. కాగా ఒక్కసారిగా ఈదురుగాలులు, మెరుపులతో పిడుగులు పడ్డాయి. గొర్రెల మందపై పిడుగుపడటంతో 3మేకలు, 14గొర్రెలు, పెంపుడు కుక్క అక్కడికక్కడే మృతిచెందాయి. ఇదే సమయంలో పక్కనే ఉన్న గొర్రెల కాపారి మద్దెల లక్ష్మయ్య, అతని భార్య షాక్‌తో స్పృహ కోల్పోయారు.. పక్కనేఉన్న చెట్టుసైతం సగం కాలిపొయింది. విషయం తెలుసుకున్న గ్రామస్థులు 108 అందించగా, వారు క్షతగాత్రులను స్థానిక ఆస్పత్రికి తరలించారు. జీవనాధారమైన గొర్రెలను కోల్పోయిన లక్ష్మయ్యను కుటుంబాన్ని ప్రభుత్వం అన్నివిధాలుగా అదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ప్రజల అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలి

» కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్


దరఖాస్తులను స్వీకరిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మం కలెక్టరేట్, మే 19(ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో ప్రజలు అందించిన అర్జీలకు ప్రాధాన్యతను ఇచ్చి, తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డితో కలిసి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్2 తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా ఆయా శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను సిద్ధం చేయాలన్నారు. గ్రీవెన్స్‌లో అందిన ప్రతి ఫిర్యాదునూ పరిష్కరించాలన్నారు. అనంతరం ఆయాశాఖల్లో పెండింగ్ ఉన్న దరఖాస్తులపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో ఏ.పద్మశ్రీ, డీఆర్డీవో సన్యాసయ్య, జిల్లా అధికారులు సత్యనారాయణ, డీఎంహెచ్‌వో డాక్టర్ కళావతి, డీపీవో ఆశాలత, ల్యాండ్ సర్వే ఏడీ శ్రీనివాసులు, కలెక్టరేట్ ఏవో అరుణ తదితరులున్నారు.

విద్యుత్ వైర్లు తగిలి వ్యక్తి దుర్మరణం


మురళీధర్‌రెడ్డి(ఫైల్)

సత్తుపల్లి, మే 19 (ఆంధ్రజ్యోతి): మోటార్ సైకిల్‌కు విద్యుత్ వైర్లు తగిలి దానిని నడుపుతున్న వ్యక్తి మంటల్లో చిక్కుకొని మృతి చెందిన సంఘటన మండలంలోని కొత్తూరులో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సత్తుపల్లి మండలం కొత్తూరులో 11కేవీ విద్యుత్ వైర్లు తెగిపడి ఉన్నాయి. అదే గ్రామానికి చెందిన చెందిన పి.మురళీధర్‌రెడ్డి (59) మోటార్‌సైకిల్‌పై సోమవారం తన వ్యవసాయ క్షేత్రానికి వెళ్తుండగా కిందపడి ఉన్న విద్యుత్ వైరు తగిలి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ మంటల్లో మోటారు సైకిల్‌తో పాటు మురళీధర్ రెడ్డి కూడా కాలిపోయి మృతి చెందాడు. కాగా వారం క్రితం వరకు మురళీధర్‌రెడ్డి తన పొలానికి వేరే రహదారిలో వెళ్లేవాడని, వారం నుంచి ఈ రోడ్డులో వెళ్తున్నాడని స్థానికులు తెలిపారు. ఆదివారం వచ్చిన ఈదురు గాలికి విద్యుత్ వైర్లు తెగిపడి ఉంటాయని భావిస్తున్నారు. మోటార్‌సైకిల్‌లో ఉన్న పెట్రోల్ మురళీధర్‌రెడ్డి శరీరంపై పడటం వల్ల మంటలు పెద్ద ఎత్తున ఎగిసిపడినట్లు విద్యుత్ అధికారులు భావిస్తున్నారు. మురళీధర్‌రెడ్డి మృతి చెందిన విషయం అటుగా వెళుతున్న వారు గమనించి కుటుంబ సభ్యులకు, గ్రామస్థులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. సత్తుపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఈతకు వెళ్లి బాలుడి మృతి


చంద్రశేఖర్(ఫైల్)

లక్ష్మీదేవిపల్లి, మే 19 (ఆంధ్రజ్యోతి): సరదాగా స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లి బాలుడు మృతి చెందిన సంఘటన సోమవారం కొత్తగూడెం ముర్రేడువాగులో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని న్యూగొల్ల గూడేనికి చెందిన ఎం.చంద్రశేఖర్ (15)ముర్రేడువాగుకు స్నేహితులకు కలిసి ఈతకు వెళ్లాడు. ముర్రేడు వాగు లోతు ఉండటం చేత ప్రమాదవశాత్తు నీటిలో మృతి చెందాడు. 9వ తరగతి చదువు పూర్తి చేసుకుని వేసవిసెలవులు కావడం చేత ఈతకు వెళ్లినట్లు సమాచారం. లక్ష్మీదేవిపల్లి ఎస్ఐ రమణారెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఉన్న మృతదేహాన్ని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా, శ్రీనగర్‌కాలనీ మాజీ ఉపసర్పంచ్ లగడపాటి రమేష్‌చంద్ సందర్శించి దర్యాప్తును పాదర్శకంగా చేయాలని పోలీసులను కోరారు.

సైబర్ నేరస్థుడి అరెస్ట్


సైబర్ నేరస్థుడితో సైబర్ పోలీసులు

ఖమ్మం ఖానాపురంహవేలి, మే 19(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరస్తుడిని ఖమ్మం సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. సీపీ సునీల్‌దత్ కేసు వివరాలను వెల్లడించారు.. ఖమ్మం జిల్లాలోని మధిర మండలం నిదానపురం గ్రామానికి చెందిన గుండా వెంకటేశ్వరరెడ్డి (20) అనే యువకుడు ఖమ్మంలోని ఖమ్మం హోమ్‌కేర్ సర్వీస్‌లో కేర్‌టేకర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. ఇతనికి గత నాలుగైదళ్ల నుంచి ఆన్‌లైన్ బెట్టింగ్‌కు పాల్పడేవాడు. ఇందులో భాగంగా గత మార్చిలో ఇతను ఖమ్మం చెందిన రిటైర్డ్ ఉద్యోగి గాదె కేశవరావు దగ్గర కేర్‌టేకర్‌గా ఉద్యోగంలో చేరాడు. నేరస్థుడైన వెంకటేశ్వరరెడ్డి ఆన్‌లైన్ బెట్టింగ్‌కు వ్యసనపరుడై అతని యజమాని దగ్గర కేర్‌టేకర్‌గా ఉంటూనే, అతనికి తెలియకుండా అతని ఫోన్‌లోని గూగుల్ పే ద్వారా బెట్టింగ్ యాప్‌లలోకి డబ్బులు డిపాజిట్ చేసి బెట్టింగ్‌లకు పాల్పడేవాడు. ఈ విధంగా రెండు వారాలు వరుసగా సుమారు రూ. 11.49లక్షలు డిపాజిట్ చేసి ఆన్‌లైన్ బెట్టింగ్ ఆడాడు. ఎవరికి అనుమానం రాకుండా గూగుల్ పే హిస్టరీని, జీమెయిల్ హిస్టరీని డెలీట్ చేశాడు. కాగా సదరు యజమాని కేశవరావు ఇటీవల బ్యాంక్‌కు వెళ్లగా నగదు లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. అతడి ఫిర్యాదుతో విచారణ చేపట్టిన పోలీసులు సదరు నేరస్థుడుని గుర్తించి విచారించగా నేరం చేసినట్లు ఒప్పుకున్నాడు. నిందితుడిని ఖమ్మం సైబర్‌క్రైం కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు. ఈ కేసు విచారణలో ముఖ్య పాత్ర వహించిన సైబర్ క్రైమ్ డిఎస్పీ ఫణిందర్, ఎస్ఐలు రంజింత్‌కుమార్, విజయ్‌కుమార్, సైబర్‌క్రైమ్ పోలీసు స్టేషన్ సిబ్బందిని సీపీ అభినందించారు.

మొలుగుమాడు గ్రామ భూసర్వే

» ప్రతి భూ కమతానికి మ్యాప్ » జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక


గ్రామంలో సరిహద్దు సర్వే నిర్వహిస్తున్న దృశ్యం

ఎర్రుపాలెం, మే19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతి కొత్త ఆర్వోఆర్ చట్టం నేపథ్యంలో రాష్ట్రంలో 5జిల్లాల్లో 5 గ్రామాలను పైలెట్ ప్రాజెక్టుగా ఎంచుకుని గ్రామాల్లో భూ సర్వే నిర్వహించిన సంబంధించిన సర్వే మ్యాపులను పకడ్బందీగా గ్రామ రికార్డులో పొందుపరచడానికి సిద్ధమవుతుంది. అత్యాధునిక సాంకేతికను ఉపయోగించుకుని భూముల రీసర్వే నిర్వహించి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన డిజిటల్ ఇండియా ల్యాండ్ రికార్డ్సు మొడ్రనైజేషన్ ప్రోగ్రామ్ మార్గదర్శకాలకు అనుగుణంగా డ్రోన్లు, ప్యూర్‌గ్రౌండ్ ట్రూతింగ్ పద్ధతి ద్వారా గ్రామాల్ల భూములను సర్వే చేసి, సరిహద్దులతో సహా ప్రతి భూ కమతాన్ని మ్యాప్‌ల ద్వారా కట్టుదిట్టం చేయాలని చూస్తుంది. దీనిలో భాగంగా ఎర్రుపాలెం మండలం మొలుగుమాడు గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంచుకుని రెవెన్యూ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్సుతో పాటు ప్రైవేటు ఏజెన్సీ ప్రతినిధులతో సంయుక్తంగా ఈ భూసర్వేని నిర్వహించనున్నారు.

సమగ్రంగా భూసర్వే

మొలుగుమాడు గ్రామంలో భూముల రీసర్వే కోసం ప్రతి కమతానికి సరిహద్దులను నిర్ధారించి ఆయా కమతాల మ్యాపులను కూడా రూపొందించనున్నారు. గ్రామంలో ఎంత భూమి, ఎన్ని సర్వే నెంబర్లు ఉన్నాయనే వివరాలు ఆధారంగా సర్వేయర్లను నియమించి ప్రతి సర్వే, బైసర్వే నెంబర్లలోని కమతాలకు విడివిడిగా మ్యాపులను తయారుచేయనున్నారు. ఇప్పటికే గ్రామాల్లో అందుబాటులో ఉన్న ఛెస్సలా, ఖాస్రా పహణీ రికార్డులతో వాటిని సరిచూసి కొత్త మ్యాపులను రెవెన్యూ రికార్డుల్లో చేర్చనున్నారు. ఈగ్రామాల్లో ఎదురయ్యే అనుభవాల ఆధారంగా రాష్ట్ర వ్యాప్తంగా భూముల రీసర్వే మార్గదర్శకాలు తయారవుతాయని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు.

మొలుగుమాడు గ్రామ చరిత్ర తీసుకుంటే తొలుత బ్రిటీష్ పాలన నుంచి ఆంధ్రా ప్రాంతంలో ఉండేది. నిజాం తెలంగాణలో ప్రస్తుతం ఏపీలోని కంచికచర్ల మండలంలో ఉన్న పరిటాల అనే గ్రామం ఉండేది. అయి తే ఉమ్మడి ఏపీ రాష్ట్రం ఏర్పడినప్పుడు జిల్లాల సరిహద్దుల మార్పుల్లో భాగంగా పరిటాలను గుంటూరు జిల్లాలో చేర్చి, మొలుగుమాడును ఖమ్మంజిల్లాలో చేర్చారు. అప్పటినుంచి తెలంగాణలో మొలుగుమాడు కొనసాగుతుంది కాగా భూరికార్డుల ప్రక్షాళన జరిగే వరకు మొలుగుమాడులోని రెవెన్యూ రికార్డులు సెంట్ల రూపంలో ఉండేవి. భూరికార్డుల ప్రక్షాళన అనంతరం గుంటల్లోకి మార్చారు. కానీ రెవెన్యూశాఖ ఆగ్రామ నక్షను ఇప్పటి వరుక తయారుచేయకపోవడం గమనార్హం. అప్పటి నుంచి గ్రామానికి అధికారికంగా గ్రామ సరిహద్దులే లేకుండా పోయాయి. ఇప్పుడు ఆగ్రామాన్ని పైలెట్ సర్వేకింద ప్రభుత్వం ఎంపికచేయడంతో మొదటగా స్థానిక రెవెన్యూ యంత్రాంగం గ్రామసరిహద్దులను నిర్ధారించింది. ఈ మేరకు గ్రామనక్షను కూడా తయారుచేయనున్నారు.

సర్వేతో 450 మంది రైతులకు లబ్ధి: తహసీల్దార్

మొలుగుమాడు పంచాయతీ కార్యాలయంలో రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో భూసర్వేపై గ్రామస్థులు, రైతులతో సోమవారం గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మన్నే ఉషాశారద మాట్లాడుతూ గతంలో మొలుగుమాడు గ్రామానికి భూముల సర్వే రికార్డులు లేకపోవడంతో గ్రామాన్ని ఎంపిక చేసినట్టు తెలిపారు. ఇప్పటికే రెవెన్యూ సర్వేయర్ సిబ్బందితో సరిహద్దులను గుర్తించినట్టు తెలిపారు. గ్రామంలో ప్రతి భూమిని అత్యాధునిక సర్వే పద్ధతిలో కొలిచి, ప్రభుత్వ, పట్టా భూములతోపాటు వాగులు,కాలవలు,డొంకలు, రోడ్లను సర్వేచేస్తామన్నారు. మొత్తం 103 సర్వేనెంబర్లలో 845 ఎకరాల భూమి సర్వే జరుగుతుందని, 450మంది రైతులకు లబ్ధి చేకూరుతుందని ఆమె తెలిపారు.



28న పుణ్యభూమి నాదేశం సినీ సంగీత విభావరి

ఖమ్మంసాంస్కృతికం, మే19 (ఆంధ్రజ్యోతి): నందమూరి తారక రామారావు 102వ జయంతి సందర్భంగా ఈనెల28న ఖమ్మం భక్తరామదాసు కళాక్షేత్రంలో పుణ్యభూమి నాదేశం పేరుతో ప్రత్యేక సినీసంగీత విభావరి నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఇసనపల్లి నగేష్, మల్లిఖార్జున్, వివిరెడ్డి, ఎస్‌వీ రమణ, మధుకుమార్ తదితరులు పేర్కొన్నారు. స్వరమాలిక కల్చరల్ ఆసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమ కరపత్రాన్ని సోమవారం భక్తరామదాసు కళాక్షేత్రంలో ఆవిష్కరించారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5 గంటలకు వరకు ఎన్టీరామారావు నటించిన చిత్రాల్లోని హిట్ పాటలను ఆలపిస్తామన్నారు. ఎన్టీఆర్‌అభిమానులు, సంగీత ప్రియులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

చకచకా సింథటిక్ ట్రాక్ పనులు



సింథటిక్ ట్రాక్‌కోసం మట్టిని తొలగించిన దృశ్యం

ఖమ్మంస్పోర్ట్స్, మే19(ఆంధ్రజ్యోతి): నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్ నిర్మాణ పనులు చకచకా కొనసాగుతున్నాయి. ట్రాక్ నిర్మాణానికి స్టేడియంలోని పాత ట్రాక్‌లో మట్టిని తొలగించి అక్కడ సింథటిక్ ట్రాక్ ఏర్పాటు చేయనున్నారు. దీనికి సంబంధించి మట్టి లేయర్లను నిర్మిస్తున్నారు. కాగా ట్రాక్‌పై వర్షపు నీరు వెంటనే బయటకు వెళ్లేందుకు ట్రాక్‌కు సమాంతరంగా డ్రెయినేజీ నిర్మాణం చేస్తున్నారు. ట్రాక్ కోసం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇటీవల శంకుస్థాపన చేసిన సంగతి తెలిసిందే. సుమారు రూ.8.50కోట్లతో 8వరుసలతో అంతర్జాతీయ స్థాయిలో అత్యాధునికంగా నిర్మాణం చేయనున్నారు. దీంతో ఖమ్మంలో జాతీయ, అంతర్జాతీయస్థాయి అథ్లెటిక్ ఈవెంట్ల నిర్వహణకు అవకాశం కలుగుతుందని క్రీడానిపుణులు పేర్కొంటున్నారు.



సింథటిక్ ట్రాక్ ప్రక్కన డ్రెయినేజీ కోసం కాలువ నిర్మాణం

కేఎంసీలో అంతర్గత మార్పులు

» ఒకేచోట రెవెన్యూ, మెప్మా విభాగాలు
» రెగ్యులర్ ఉద్యోగులకే డిజిటల్ సంతకాలు
» కేఎంసీలో విభాగాలు పరిశీలించిన కమిషనర్ అగస్త్య



ఏఎంసీకి ఆదేశాలిస్తున్న కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఖమ్మంసంక్షేమవిభాగం, మే19 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంనగర పాలక సంస్థలోని కొన్ని విభాగాల్లో అంతర్గత మార్పులు చోటు చేసుకున్నాయి. ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన పలు కథనాలపై కమిషనర్ స్పందించి ప్రజల సౌకర్యార్థం పలు కీలకమైన నిర్ణయాలు తీసుకున్నారు. ఆసరా నుంచి రెవెన్యూ విభాగాల వరకు విధానపరమైన మార్పులకు శ్రీకారం చుట్టారు. సోమవారం ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలోని పలు విభాగాలను కమిషనర్ అభిషేక్ అగస్త్య తనిఖీలు చేశారు. తక్షణ చర్యలు తీసుకోవాలని అసిస్టెంట్ కమిషనర్ అహ్మద్ షఫీ ఉల్లాను ఆదేశించారు. దీంతో సాయంత్రానికే మార్పులు చోటు చేసుకున్నాయి.

ప్రజావాణి చోటనే రెవెన్యూ విభాగం

ఖమ్మం నగర పాలక సంస్థకు వచ్చే ఫిర్యాదుల్లో 70శాతం మేరకు రెవెన్యూ విభాగానివే ఉంటాయి.అయితే రెవెన్యూఆఫీసర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, బిల్‌కలెక్టర్లు వేర్వేరు ఫ్లోర్‌లో ఉండటంతో కేఎంసీకి ఫిర్యాదులు చేసేందుకు వచ్చిన ప్రజలకు అధికారులను కనిపెట్టటమే పెద్ద టాస్క్‌గా మారింది. ఈ క్రమంలో ఇటీవల ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనాలపై కమిషనర్ స్పందించారు. కేఎంసీ కార్యాలయం కిందిభాగంలోని ప్రజావాణి వద్దనే ఆర్వో ఆర్ ఐలు, బిల్‌కలెక్టర్లు వార్డు ఆఫీసర్లకు విభాగాలు కేటాయించారు. వార్డుఆఫీసర్లు, బిల్‌కలెక్టర్లుకు ప్రత్యేకంగా క్యాబిన్‌లు ఏర్పాటు చేయాలని కమిషనర్ ఆదేశించారు.

రెండో ఫ్లోర్‌లోకి మెప్మా

కేఎంసీలో గ్రౌండ్‌ఫ్లోర్‌లో మెప్మాజిల్లా మిషన్ కోఆర్డినేటర్, రెండోఫ్లోర్‌లో టౌన్‌మిషన్ కోఆర్డినేటర్ మరియు సీవోల గదులు కేటాయించారు. మెప్మాకార్యాలయానికి వచ్చే కార్పొరేటర్లు, రిసోర్స్ పర్సన్‌లకు పెద్ద సమస్యగా మారింది. మెప్మా విభాగాలు మొత్తం ఒకేప్రాంతంలో రెండోఫ్లోర్‌లో ఉండాలని కమిషనర్ ఆదేశించారు. మెప్మా డీఎంసీ చాంబర్‌ను ఆర్వోకు కేటాయించారు.

ఐదుగురు కంప్యూటర్ ఆపరేటర్ల మార్పులు

కేఎంసీలో ఎన్నో ఏళ్లుగా ఒకేవిభాగంలో బాధ్యతలు నిర్వహిస్తున్న ఐదుగురు కంప్యూటర్ ఆపరేటర్లును కమిషనర్ అభిషేక్ అగస్త్య విభాగాలు మార్పులు చేశారు. ఇంజనీరింగ్, రెవెన్యూ, ఐటీ, ప్రజావాణి విభాగాల్లో మార్పులు చేర్పులు చేశారు.

రెగ్యూలర్ ఉద్యోగులకే డిజిటల్ సంతకాలు

కేఎంసీలో ఆసరా విభాగం నుంచి ఎంతో కీలకమైన రెవెన్యూ విభాగం వరకు అధికారుల పర్యవేక్షణలో ఉండాల్సిన డిజిటల్ సంతకాలు అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల చేతిలోకి వెళ్లాయి. దీంతో పలు సమస్యలు, అవినీతి ఆరోపణలు వ్యాపించాయి. ఈ క్రమంలోనే ఇటీవల రెవెన్యూ విభాగంలోని అధికారులకు షోకాజ్ నోటీసులు అందుకున్నారు. దీంతో కేఎంసీలోని అన్ని విభాగాల డిజిటల్ సంతకాలను రెగ్యూలర్ ఉద్యోగులకు కేటాయించేలా కమిషనర్ ఆదేశాలిచ్చారు.

ప్రజలకు సత్వరం పరిష్కారం చూపాలి

కమిషనర్ అభిషేక్ అగస్త్య

ప్రజావాణిలో ఫిర్యాదుల స్వీకరణ

ఖమ్మంసంక్షేమవిభాగం, మే19 (ఆంధ్రజ్యోతి): ప్రజాఫిర్యాదుల పరిష్కారానికి అత్యధిక ప్రాధాన్యత కల్పించి తక్షణ పరిష్కారం చూపాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశించారు. సోమవారం ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. మొత్తం 22 ఫిర్యాదులురాగా వాటిలో 21ఫిర్యాదులు రెవెన్యూ విభాగానివే ఉన్నాయి. ఒకే ఇంటికి రెండు ఇంటి నెంబర్లు, ఇంటి కొలతల కంటే ఎక్కువగా నమోదు జరిగాయి. తాగునీటి కుళాయిలు బిల్లులు వంటి ఫిర్యాదులు అందాయి. ఖమ్మం నగరంలో విద్యుత్ సమస్యలపై సీపీఎం ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై విక్రమ్ వినతిపత్రాలు అందించారు. ప్రతీ ఫిర్యాదుపై సంబంధిత అధికారులతో కమిషనర్ సమీక్షించారు. నిబంధనల మేరకు తక్షణం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈఈ కృష్ణలాల్, ఆర్వో శ్రీనివాసరావు, పట్టణ ప్రణాళిక అధికారి గందం వసుంధర, ఏవో శివలింగం, టీఎంసీ గుడిపూడి సుజాతరాణి, పారిశుధ్య పర్యవేక్షకుడు సాంబయ్య ఇతర అధికారులు పాల్గొన్నారు.



సుందరయ్య జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

» సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని



సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సుదర్శన్‌రావు,నేలకొండపల్లిలో..

ఖమ్మంరూరల్, మే19(ఆంధ్రజ్యోతి): మార్క్సిస్టు యోధుడు, దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ రావు తెలిపారు. మండల పరిధిలోని గుదిమళ్ల, తెల్దారుపల్లి, తల్లంపాడు, కాచిరాజుగూడెం, ఎం.వెంకటాయపాలెం, ఆరెంపుల, మద్దులపల్లి, తదితర గ్రామాల్లో సుందరయ్య 40వ వర్ధంతిని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటి సభ్యురాలు బుగ్గవీటి సరళ, జిల్లా నాయకులు బత్తినేని వెంకటేశ్వర్లు, సంజీవరెడ్డి, సిద్దినేని కోటయ్య, షేక్.బషీరుద్దీన్, నండ్రా ప్రసాద్, మండల కార్యదర్శి ఊరడి సుదర్శన్ రెడ్డి, వెంకటరమణ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేలకొండపల్లి: పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతినిసోమవారం సీపీఎంశ్రేణులు ఘనంగా నిర్వహించాయి. తొలుత సుందరయ్య చిత్రపటానికి పూలమాలలేసి ఘన నివాళులర్పించారు. మండల కార్యదర్శి కొప్పుల వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ సంపన్న భూస్వాముల కుటుంబంలో జన్మించిన సుందరయ్య చిన్నతనం నుంచే పేద ప్రజల పక్షాన ఉద్యమించటం ప్రారంభించారన్నారు. ఆయన ఆశయ సాధన కోసం కృషి చేయటమే ఆయనకిచ్చే నిజమైన నివాళన్నారు. కార్యక్రమంలో రచ్చా నర్సింహారావు, మారుతి కొండలరావు, రావెళ్ల అజయ్‌కుమార్, జిడుగు బాబు, మాతంగి సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ తనిఖీ



అధికారులతో సమావేశమైన పురుషోత్తం

ఖమ్మంసంక్షేమవిభాగం, మే19(ఆంధ్రజ్యోతి): రవాణాశాఖ డిప్యూటీ కమిషనర్ పురుషోత్తం సోమవారం జిల్లా రవాణా కార్యాలయంలో రికార్డులు తనిఖీలు చేపట్టారు. ఉద్యోగులు, సిబ్బందిని అందర్నీ పిలిపించి వారి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఇన్‌చార్జ్ జిల్లా రవాణా అధికారి వెంకటరమణతో మాట్లాడారు. తర్వాత ఖమ్మం నుంచి కొత్తగూడెం వెళ్లారు. డీటీసీ వెళ్లిన తర్వాత కొన్ని గంటలకు జిల్లా రవాణాశాఖ అధికారులు ఫొటోలను మీడియాకు పంపారు. కొన్ని నెలలుగా పలు ఆరోపణలు ఎదుర్కొంటున్న జిల్లా రవాణాశాఖ కార్యాలయానికి డిప్యూటి ట్రాన్స్‌పోర్టు కమిషనర్ వచ్చి రికార్డులు పరిశీలించి వెళ్లిన తర్వాత స్థానిక అధికారులు మీడియాకు లీకులు ఇవ్వటంపై పలువిమర్శలు వెలువడుతున్నాయి.

చెల్లని చెక్కు కేసులో 6నెలల జైలు

ఖమ్మంలీగల్, మే19(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరం యూపీహెచ్ కాలనీకి చెందిన తుమరాడ సింహాచలానికి చెల్లని చెక్కుకేసులో 6 నెలలు జైలుశిక్షతో పాటు రూ.50వేల జరిమానా విధిస్తూ ఖమ్మం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయాధికారి కాసరగడ్డ దీప సోమవారం తీర్పుచెప్పారు. పాండురంగాపురం గ్రామానికి చెందిన భుక్యా కృష్ణశేఖర్ వద్ద నిందితుడు 2017లో రూ.4లక్షలు అప్పుగా తీసుకున్నాడు. 2018లో రూ.4 లక్షల 20వేలకు చెక్కు జారీ చేశాడు. బ్యాంక్ ఖాతాలో జమచేయగా నిందితుడు నగదు చెల్లించవద్దని బ్యాంకు వారిని కోరటంతో చెక్కు తిరస్కరణకు గురైంది. ఫిర్యాది తన న్యాయవాది కొల్లిపాక కమలాకర్‌రావు ద్వారా కోర్టులో ప్రైవేటు కేసు దాఖలుచేశారు. ఈ కేసును విచారించిన న్యాయాధికారి నిందితునిపై నెగోషియబుల్ ఇన్స్ట్రుమెంట్ యాక్ట్ కింద నేరం రుజువుకావటంతో పైవిధంగా శిక్ష విధిస్తూ తీర్పుచెప్పారు.

భద్రాద్రి స్పాంజ్ ఐరన్ ఫ్యాక్టరీ తనిఖీ

» అప్పలనర్సింహాపురం రైతుల ఫిర్యాదుతో కదిలిన అధికారులు



రైతులతో మాట్లాడుతున్న అధికారులు

నేలకొండపల్లి, మే19(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అప్పలనర్సింహాపురంలోని భద్రాద్రి స్పాంజ్ ఐరన్ ఫ్యాక్టరీని సోమవారం సాయంత్రం తనిఖీ చేశారు. ఫ్యాక్టరీ నడిచే సమయంలో కాలుష్యం వలన పంటలు నాశనమై పోతున్నాయని, దిగుబడి పూర్తిగా తగ్గిపోయి తీవ్రంగా నష్టపోతున్నామని గ్రామానికి చెందిన రైతులు సుమారు మూడు నెలల క్రితం కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ)కు ఫిర్యాదు చేశారు. ఈనేపథ్యంలో సోమవారం సాయం త్రం పీసీబీ అధికారులు ఫ్యాక్టరీని తనిఖీ చేశారు. 20రోజుల నుంచి ఫ్యాక్టరీ సరిగా నడవక పోవటం గమనార్హం. అధికారులు రైతుల పొలాలను పరిశీలించటంతో పాటుగా, రైతులను వివరాలడిగి తెలుసుకున్నారు. ఫ్యాక్టరీ యాజమాన్యానికి కాలుష్యం రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశాలిచ్చామని, యాజమాన్యం కాలుష్యం రాకుండా చర్యలు తీసుకోక పోతే, చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించినట్లు అధికారులు రైతులకు తెలిపారు. తిరిగి నెల తర్వాత మళ్లీ ఫ్యాక్టరీని తనిఖీ చేస్తామని పీసీబీ అధికారులు చెప్పినట్లు రైతులు చెప్పారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు చెందిన ప్రొఫెసర్లు గోపాల్, శ్రీధర్, కొత్తగూడెం పీసీబీ ఏఈఈలు తనిఖీ చేసిన వారిలో ఉన్నారు.

ఆత్మహత్య కేసులో మూడేళ్ల జైలు

ఖమ్మంలీగల్, మే19(ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం కోసం వేధించిన ఏన్కూరు మండలం తూతక లింగన్నపేటకు చెందిన నామా నరేష్‌కు మూడు సంవత్సరాల జైలుశిక్షతో పాటు రూ.10వేల జరిమానావిధిస్తూ ఖమ్మం మొదటి అదనపు అసిస్టెంట్ సెషన్స్ కోర్టు న్యాయాధికారి వి.శివరంజని సోమవారం తీర్పు చెప్పారు. ఫిర్యాది మండెపూడి శ్రీనివాసరావు కథనం ప్రకారం... తేజశ్రీని నామా నరేష్‌కు ఇచ్చి మే 27 2011న వివాహం జరిపించారు. కొన్ని సంవత్సరాలు సంతోషంగా ఉన్నారు.కొంతకాలం అదనపు కట్నం తీసుకొని రమ్మని భర్త, అత్తమామలు వేధిస్తుండటంతో ఆమె 2019 లో అత్తవారి ఇంటిలోనే ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. దీనిపై కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. భర్త,అత్తమామలేనని మృతికి కారణమని ఏన్కూరు పోలీసులకు వివరించారు. దీంతో నిందితులపై కేసు నమోదు చేశారు. కేసును విచారించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసును విచారించిన న్యాయాధికారి మొత్తం 12మంది సాక్షులను విచారించారు. నేరం రుజువు కావటంతో పైవిధంగా శిక్షవిధిస్తూ తీర్పు చెప్పారు.అత్తమామలుపై నేరం రుజువు కాకపోవటంతో నిర్ధోషులుగా తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరుపున పీపీ స్వప్న వాదించగా, లైజన్ ఆఫీసర్ కె.శ్రీకాంత్, కోర్టుకానిస్టేబుల్ భరత్ సహకరించారు.

బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్లు



కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌ను కలిసిన తహసీల్దారు సైదులు

ఖమ్మంకలెక్టరేట్, మే19(ఆంధ్రజ్యోతి): ఖమ్మం అర్బన్ మండల తహసీల్దారుగా డి.సైదులు సోమవారం బాధ్యతలు చేపట్టారు. జిల్లాలో పనిచేసిన ఆయన ఎన్నికల బదిలీల్లో భాగంగా ఆయన మహబూబాబాద్‌కు బదిలీ అయ్యారు. ఆ తర్వాత గత గురువారం రాష్ట్రవ్యాప్తంగా తహసీల్దార్లు తిరిగి ఆయా జిల్లాలకు బదిలీ చేశారు. దీంతో ఖమ్మం వచ్చారు. కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్ సైదులును ఖమ్మం తహసీల్దారుగా నియమించడంతో సోమవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అదనపు కలెక్టర్ పి శ్రీనివాసరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించారు.

తిరుమలాయపాలెం: తిరుమలాయపాలెం తహసీల్దార్‌గా విల్సన్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన ఖమ్మంఅర్బన్ మండలం రఘునాధపాలెం తహసీల్దార్‌గా పనిచేస్తున్నారు. బదిలీపై తిరుమలాయపాలెం వచ్చారు ఇక్కడ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా పనిచేస్తున్న సుధీర్ డిప్యూటీ తహసీల్దార్‌గా బాధ్యతలు అప్పగించారు.

23న అథ్లెటిక్స్ ఎంపికలు

ఖమ్మంస్పోర్ట్స్, మే19(ఆంధ్రజ్యోతి):జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మే 23న కల్లూరు మినీ స్టేడియంలో అండర్- 8,10,12 సబ్ జూనియర్ అథ్లెటిక్స్ జట్ల ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రెటరీ ఎండీ షఫీక్‌అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిభ చూపిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపికచేసి త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపుతామని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు జననద్రువీకరణతో ఉదయం స్టేడియానికి చేరుకోవాలని సూచించారు.

25న మునిసిపాలిటీ సిబ్బందికి వైద్యశిబిరం

ఖమ్మంరూరల్,మే19(ఆంధ్రజ్యోతి): ఏదులాపురం మునిసిపాలిటీలో పని చేస్తున్న సిబ్బందికి ఈనెల 25న వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 25న పెద్దతండాలోని జలగంనగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో ఈశిబిరం నిర్వహించడం జరుగుతుందన్నారు.

ధాన్యం కొనాలని రాస్తారోకో

తిరుమలాయపాలెం, మే19(ఆంధ్రజ్యోతి): మండలంలో జల్లేపల్లిలో ధాన్యం కొనుగోలు చేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. రైతులు రబీలో ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తెచ్చి 20రోజులు కావస్తున్నా కాంటాలు వేయడానికి జాప్యం నిరసిస్తూ రాస్తారోకో నిర్వహించారు. రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలు తెచ్చినెలలు కావస్తున్నా అధికారులు కొనుగోలు చేయడం లేదన్నారు. రైతుల ధాన్యాన్ని తరుగుపేరుతో 7కేజీల వరకు తరుగు తీస్తున్నారని మండల కార్యదర్శి కొమ్ము శ్రీను పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దాసరి మహేందర్, మట్టా సుధాకర్, దడిదల వెంకన్న, అల్లి శ్రీను, ఉన్నం శ్రీను టి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆలయంలో పాము కలకలం

ఖమ్మంఖానాపురంహవేలి, మే19(ఆంధ్రజ్యోతి): నగరంలోని కన్‌బజార్ వెంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పూల దండలో ఓ పాము రావటంతో అర్చకులు ఆందోళన గురయ్యారు. స్థానికుల వివరాల ప్రకారం.. సోమవారం ఉదయం స్వామికి అలంకరణ చేస్తుండగా ఓ పూల దండలో పాము కబపడటంతో అర్చకులు భయాందోళనకు గురైనారని, ఆలయ సిబ్బంది ఆ పామును పూల దండలు తీసుకొచ్చిన కవర్‌లో బందించి బైట ప్రాతంలో వదిలినట్లు తెలిపారు. గంట పాటు భక్తులు, అర్చకులు, సిబ్బంది భయంతో వణికిపోయారు.

ట్రాఫిక్ సీఐ బాధ్యతల స్వీకరణ

ఖమ్మంఖానాపురంహవేలి,మే19(ఆంధ్రజ్యోతి): ఖమ్మం ట్రాఫిక్ సీఐగా నియమితులైన బెల్ల. సత్యనారాయణ సోమవారంరాత్రి బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల బదిలీల్లో భాగంగా ట్రాఫిక్ సీఐగా మోహన్ బాబు ఖమ్మం త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ కావటంతో ఆయనస్థానంలో సత్యనారాయణ నియమితులయ్యారు. ఆయన బాధ్యతలు స్వీకరించారు.

ఉపాధ్యాయుల నిరసన

ఖమ్మంఖానాపురంహవేలి, మే19(ఆంధ్రజ్యోతి): సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించిన ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు రెమ్యునరేషన్, ఎస్ఎస్‌సీ స్పాట్ బకాయిలు వెంటనే ముంజూరు చేయాలని కోరుతూ సోమవారం యూటీఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నూతన కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. సమగ్ర కుటుంబ సర్వేలో నెల రోజులు ఇంటింటి సర్వే నిర్వహించిన ఉపాధ్యాయులకు ఆరు నెలలు దాటినా రెమ్యునరేషన్ మంజూరుచేయలేదని అన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రంజాన్, నాగేశ్వరరావు, వెంకన్న, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

దోస్త్ మొదటి విడత దరఖాస్తులకు రేపే ఆఖరు

ఖమ్మంఖానాపురంహవేలి, మే19(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు డిగ్రీలో చేరటానికి దోస్త్ మొదటి విడతలో దరఖాస్తులు చేసుకోవటానికి బుధవారం చివరిరోజని, ఆప్షన్లు ఇవ్వటానికి గురువారం చివరి రోజని ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ మోహ్మద్. జాకీరుల్లా తెలిపారు. రెండోవిడత ఈనెల 30 నుంచి జూన్ 9 వరకు దరఖాస్తులు చేయవచ్చునని తెలిపారు. మరిన్ని వివరాలకు కళాశాలలో సంప్రదించాలని తెలిపారు.

పాఠ్యపుస్తకాల పంపిణీ

ఖమ్మంఖానాపురంహవేలి, మే19(ఆంధ్రజ్యోతి): జిల్లా పాఠ్యపుస్తకాల గోదాం నుంచి వివిధ మండలాలకు పాఠ్యపుస్తకాలను సోమవారం జిల్లా విద్యాశాఖ అధికారి కె. సత్యనారాయణ పంపిణీని ప్రారంభించారు. ముందుగా సరఫరా రికార్డులను పరిశీలించారు. వారం రోజులలో పాఠ్యపుస్తకాలను అన్ని మండల కేంద్రాలకు సరఫరా చేస్తామని అన్నారు. మొత్తం 4,92,970 పుస్తకాలకు గాను సోమవారం వరకు 3,76,380 పుస్తకాలు జిల్లాకు చేరాయని తెలిపారు. మిగిలిన పాఠ్యపుస్తకాలు, వారం రోజులలో ఖమ్మం చేరతాయన్నారు. నోట్ బుక్స్ నేరుగా హైదరాబాద్ నుంచి పాఠశాలకే అందించటం జరిగిందన్నారు.





ఆంధ్రజ్యోతి

● మధిర, ఎర్రుపాలెం, బోనకల్, చింతకాని, ముదిగొండ
● వైరా, కొణిజర్ల, కారేపల్లి, ఏన్కూరు , జూలూరుపాడు
● సత్తుపల్లి, కల్లూరు, తల్లాడ, వేంసూరు, పెనుబల్లి

ZONE

మంగళవారం 20 మే 2025

వైరా-మధిర
సత్తుపల్లి

8

WYRA, MADHIRA, SATHUPALLY

విత్తనాల ఎంపికలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

తల్లాడ, మే 19 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో రైతులు విత్తనాల ఎంపికలో జాగ్రత్త వహించాలని తల్లాడ మండల వ్యవసాయ అధికారి ఎండీ.తాజుద్దీన్ సూచించారు. సోమవారం స్థానిక రైతువేదికలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. లైసెన్స్ ఉన్న డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలని, బిల్లు తీసుకోవడం తప్పనిసరన్నారు. విత్తనాల కొనుగోలు సమయంలో బిల్లుపై డీలర్లు, రైతుల సంతకాలుండాలని, బిల్లు రశీదును పంటకాలం పూర్తయ్యేవరకు భద్రపరుచుకోవాలని, అవసరమైనప్పుడు ఇది ఆధారంగా ఉపయోగపడుతుందన్నారు. లైసెన్సు లేకుండా గ్రామాలలో తిరుగుతు విత్తనాలు విక్రయించే బిల్లులు ఇవ్వని వ్యాపారులు సమాచారాన్ని వెంటనే వ్యవసాయాధికారులకు ఇవ్వాలన్నారు.

ఏకరూప దుస్తుల కేంద్రాల తనిఖీ



దుస్తుల కుట్టు కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న రాజశేఖర్

కల్లూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): కల్లూరు మండల పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి విద్యార్థులకు అందించనున్న ఏకరూప దుస్తుల కుట్టు కేంద్రాలను సోమవారం పాఠశాల కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి రాజశేఖర్ ఆకస్మిక తనిఖీ చేశారు. మండల పరిధిలోని నారాయణపురం, పాయపూరు, ముచ్చవరం, కుట్టు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలల ప్రారంభానికి ముందుగా ఏకరూప దుస్తులను సిద్ధంగా ఉంచనున్నట్లు చెప్పారు. జూన్ ఒకటవ తేది నాటికి ఏకరూప దుస్తులు పాఠశాలలకు చేరుతాయని, రెండవ తేదిన రాష్ట్ర అవతరణ దినోత్సం సందర్భంగా జెండా ఆవిష్కరణ, జూన్ 6 నుంచి 19 తేది వరకు బడిబాట కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు, రాత పుస్తకాలు, అన్నింటిని అందించనున్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఐకేపి సీసీ ఫాతిమా, అకౌంటెంట్ అపర్ణ, సీఆర్పి వేలాద్రి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పనులను పరిశీలించిన రాయల

ముదిగొండ, మే 19 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ మండలం ఎడవల్లిలోని శ్రీలక్ష్మీ నర్సింహస్వామి ఆలయ శంకుస్థాపన పనులను సోమవారం రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు పరిశీలించారు. ఇటీవల లక్ష్మీ నర్సింహస్వామి దేవాలయ పునర్నిర్మాణ పనులకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో నిధులు మంజూరు చేశారు. త్వరలో శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో ఈ పనులను రాయల పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా రాయల ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీలు బులెట్‌బాబు, పసుపులేటి దేవేంద్రం, నాయకులు కందిమళ్ల వీరబాబు, సామినేని వెంకటయ్య, మట్టా రవీందర్‌రెడ్డి, ఐనాల నర్సింహారావు, చెరుకుపల్లి రాంబాబు పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలను అమలుచేయాలి

పెనుబల్లి, మే 19 (ఆంధ్రజ్యోతి): గత అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలుపర్చకుండా గత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తూ ఏడాదికాలాన్ని గడిపిందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు చలమాల విఠల్‌రావు విమర్శించారు. సోమవారం స్థానిక తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరు గ్యారెంటీలను అమలుచేయాలని, రాజకీయాలకతీతంగా ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువ వికాసం రుణాలు ఇవ్వాలని, పోడుభూములు సాగుచేసుకుంటున్న రైతులకు కరెంట్ మోటర్లు ఇవ్వాలని, ఎస్సీ, బీసీ పోడుసాగుదారులపై దాడులను ఆపాలని కోరారు. అనంతరం తహసీల్దార్, ఎంపీడీవోలకు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు తడికమళ్ల చిరంజీవి, కండే సత్యం, చమటా విశ్వనాథం, మిట్టపల్లి నాగమణి, గుడిమెట్ల బాబు, భూక్యా ప్రసాద్, చిలకా రామచంద్రుడు, కుంజా రాములు, నీలమ్మ, విజయ, రమాదేవి పాల్గొన్నారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

కల్లూరు, మే 19 (ఆంధ్రజ్యోతి) మండల పరిధిలోని ఓ గ్రామంలో బాల్య వివాహం జరుగుతుండగా ఐసీడీఎస్ అధికారులకు అందిన సమాచారంతో అడ్డుకున్న సంఘటన సోమవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. బాల్య వివాహాన్ని ప్రోత్సహించిన తల్లిదండ్రులను స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తీసుకోవచ్చి తహసీల్దార్ సమక్షంలో వారిని బైండోవర్ చేశారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ నిర్మలజ్యోతి, ఏసీడీపీఓ రత్నమ్మ, సూపర్‌వైజర్లు సుజాత, సంధ్యా పాల్గొన్నారు.

ఇద్దరిపై కాపుసారా బైండోవర్ కేసు

కల్లూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు కాపుసారా తయరికి పాల్పడటంపై బైండోవర్ కేసు నమోదు చేశారు. సోమవారం తహసీల్దార్ పి.సాంబశివుడు ముందు వారిని ఎక్సైజ్ శాఖ వారు హాజరుపరిచారు. లక్ష్మీపురం గ్రామానికి చెందిన గుగులోతు బద్రు, దిప్లావత్ బద్రు కాపుసారా తయారికి పాల్పడ్డారు. వారిపై ఎక్సైజ్‌శాఖ వారు కేసు నమోదు చేశారు. మరో సారి అరెస్ట్ అయితే జైలు శిక్ష తప్పదని, రేషన్ కార్డులు రద్దుతో పాటుగా పలు సంక్షేమ పథకాలు రద్దు చేస్తామని తహసిల్దార్ సాంబశివుడు చెప్పారు.

రిజర్వాయర్ రోడ్డు పనుల్లో తగ్గిన వెడల్పు

- రూ.80లక్షల సుడా నిధులతో పనులు
- ఇదివరకు 100అడుగుల వెడల్పుతో రోడ్డు
- వెడల్పు తగ్గించడంతో స్థానికుల్లో మొదలైన ఆందోళన
- పర్యాటకంగా ఈ ప్రాంతానికి గుర్తింపు
- పట్టించుకోని ఉన్నతాధికారులు



మొదలైన రిజర్వాయర్ రోడ్డు పనులు

వైరా, మే 19 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ, మండల, మున్సిపల్ కేంద్రంలో అత్యంత కీలకమైన రిజర్వాయర్ రోడ్డు అభివృద్ధి పనులపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఏర్పడింది. ఈ రోడ్డులోని ఆక్రమణలు తొలగించకుండా రోడ్డు పనులు చేయటాన్ని స్థానికులు తప్పుబడుతున్నారు. వైరాలోని జాతీయ ప్రధాన రహదారి నుంచి రిజర్వాయర్‌కు వెళ్లేందుకు ఈ రోడ్డు ఎంతో కీలకంగా ఉంది. పర్యాటకంగా ఈ రోడ్డు రిజర్వాయర్‌కు గుండెకాయ వంటిది. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మదిలో ఉన్న ఈ పర్యాటక కేంద్రం అభివృద్ధికి విరుద్ధంగా ఈ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. రూ.80లక్షల సుడా నిధులతో కొద్దిరోజుల కిందట ఈ రోడ్డు పనులు మొదలుపెట్టారు. జాతీయ ప్రధాన రహదారి నుంచి రిజర్వాయర్ కుడి కాల్వ ప్రధాన లాకుల వరకు ప్రస్తుతం ఈ పనులు చేపట్టారు. ఈ రిజర్వాయర్ రోడ్డు 80నుంచి 100అడుగుల వెడల్పుతో ఉండేది. అయితే ఇప్పుడు అది కాస్తా 52నుంచి 70అడుగుల వరకు ఆక్రమణలతో కుదించుకుపోయింది. ఈ ఆక్రమణలను తొలగించి రోడ్డును వెడల్పుగా నిర్మించాల్సి ఉంది. అయితే అందుకు భిన్నంగా కేవలం 52నుంచి 55అడుగుల వెడల్పుతోనే రోడ్డు పనులు అడ్డదిడ్డంగా నిర్వహిస్తున్నారు.

మూడేళ్ల కిందట 60అడుగులకు నిర్ణయించినప్పటికీ...

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే పట్టణాభివృద్ధిలో భాగంగా ఈ రోడ్డు అభివృద్ధికి సుడా నుంచి రూ.కోటి నిధులు మంజూరయ్యాయి. ఈ రోడ్డులో ఉన్న ఆక్రమణలను తొలగించే విషయమై అప్పటి బీఆర్ఎస్ శ్రేణులకు ప్రతిపక్ష కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ, టీడీపీ మాస్‌లైన్ శ్రేణులకు మధ్య ఘర్షణ వాతావరణం ఏర్పడింది. చివరికి నాటి ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ అనేకసార్లు అఖిలపక్ష సమావేశాలు నిర్వహించి చివరకు 60అడుగుల వెడల్పుతో రోడ్డు పనులు చేయాలని నిర్ణయించారు. ఆ మేరకు కొన్ని ఆక్రమణలు కూడా తొలగించారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఈ రోడ్డు నిర్మాణానికి రాములునాయక్ శంకుస్థాపన కూడా చేశారు. అయితే పనులు మొదలుకాలేదు. అసెంబ్లీ ఎన్నికలు జరిగి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది.

మూడేళ్లకు మొదలైన పనులు...

సుడా నుంచి నిధులు మంజూరైన మూడేళ్లకు మళ్లీ ఇప్పుడు పనుల హడావుడి మొదలైంది. గతంలో నిర్ణయించిన 60అడుగుల వెడల్పు నిర్ణయాన్ని విస్మరించి నేడు అడ్డగోలుగా వెడల్పు తగ్గించి పనులు మొదలుపెట్టారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుతం 52అడుగుల నుంచి 55అడుగుల వెడల్పుతోనే ఈ రోడ్డు పనులు చేపట్టడంపై స్థానికుల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. వెడల్పు తగ్గించి రోడ్డు నిర్మించటం ద్వారా ఆక్రమణలకు అధికారికంగా ఆమోద ముద్ర వేసినట్లవుతుందని ఆ తర్వాత వాటిని కదిలించే నాథుడే ఉండడని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. గతంలో నిర్ణయించిన మాదిరిగా 60అడుగుల వెడల్పుతో అయినా ఈ రోడ్డు నిర్మించాలనే డిమాండ్ బలంగా వినిపిస్తోంది. కుడికాల్వ ప్రధాన లాకుల ముందున్న వంతెనకు పూర్తిగా బీటీ రోడ్డు పనులు చేపట్టకుండా ఆ వంతెన సగం వరకే పనులు చేస్తుండడాన్ని కూడా నిరసిస్తున్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆలోచనల మేరకు ఈ రిజర్వాయర్ రోడ్డును తల్లాడ మండలం కొడవటిమెట్ట మీదుగా జాతీయ ప్రధాన రహదారి వరకు అభివృద్ధి చేయాలని సంకల్పించారు. గత ఏడాది ఆగస్టు 13న పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి ఈ రిజర్వాయర్ వద్ద పర్యాటక కేంద్ర అభివృద్ధిపై అధికారులతో సమీక్షించారు. విశాలమైన రోడ్డును వైరాలోని జాతీయ ప్రధాన రహదారి నుంచి వైరా పర్యాటక కేంద్రాన్ని అనుసంధానం చేస్తూ కొడవటిమెట్ట సమీపంలో ఉన్న జాతీయ ప్రధాన రహదారి వరకు నిర్మించేందుకుగానూ అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని భట్టి విక్రమార్క ఆర్అండ్‌బీ, పర్యాటకశాఖ అధికారులను ఆదేశించారు. ఆ ప్రతిపాదనలు సిద్ధమవుతున్న తరుణంలోనే ఇంత హడావుడిగా వెడల్పు తగ్గించి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టడాన్ని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ చొరవ తీసుకుని 60అడుగుల వెడల్పుతో అయినా రోడ్డు నిర్మించేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

సరస్వతీ పుష్కరాల్లో వైరా ఎమ్మెల్యే దంపతులు



శ్రీకాళేశ్వర ముక్తేశ్వరస్వామి దర్శనం చేసుకున్న ఎమ్మెల్యే దంపతులు

వైరా, మే 19 (ఆంధ్రజ్యోతి): సరస్వతీ పుష్కరాల్లో సోమవారం వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, లలిత దంపతులు, కుటుంబసభ్యులతో కలిసి పుణ్యస్నానాలు చేసి నదీహారతి ఇచ్చారు. ఆ తర్వాత శ్రీకాళేశ్వర ముక్తేశ్వరస్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

క్షతగాత్రుడికి ఆర్థిక సాయం

సత్తుపల్లి, మే 19 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యువకుడికి యువ సేవాసమితి వారు ఆర్థిక సహాయం అందించారు. దమ్మపేటకు చెందిన దేవేంద్ర రోడ్డుప్రమాదంలో గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం డబ్బు అవసరం కావడంతోరూ.30 వేలు ఆర్థిక సహాయం బాధితుడి తండ్రి శంకరరావుకు అందజేశారు. సేవాసమితి అధ్యక్షుడు జొన్నలగడ్డ రాజు, నరేష్‌కుమార్ నాయుడు, ముష్టిబండ జోనబోయిన రామనరేష్, మహమ్మద్ అబ్దుల్ పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువుల వాడకం వల్లే అధిక దిగుబడి



ఆయిల్‌పామ్ , మిర్చిసాగు బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ అధికారులు

ఏన్కూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): సేంద్రియ ఎరువుల వాడకం వల్ల అధిక దిగుబడులు పొందవచ్చని వైరా కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ కె.రవికుమార్ రైతులకు సూచించారు. సోమవారం నాచారం రైతువేదికలో రైతు ముగింట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ.. అవసరం మేరకే రసాయనిక ఎరువులను వాడాలని అన్నారు. యూరియా వాడకం తగ్గించడం వల్ల సాగు ఖర్చు తగ్గుతుందన్నారు. పంట మార్పిడి చేస్తూ భూసారాన్ని కాపాడాలన్నారు. రైతులు కొనుగోలు చేసిన ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల బిల్లులను పంటకాలం పూర్తయ్యే వరకు భద్రపరుచుకోవాలన్నారు. అనంతరం ఉద్యానశాస్త్రవేత్త వి.చైతన్య సాగునీటి ప్రాధాన్యత, పర్యావరణ పరిరక్షణ గురించి వివరించారు. జిల్లా రైతుసంఘం నాయకులు నల్లమల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలను సాగుచేయాలని కోరారు. వైరా వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు కరుణశ్రీ మాట్లాడుతూ.. మేలైన యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు వివరించారు ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఆరెం వరలక్ష్మి, ఉద్యాన అధికారి వేణు, పశువైద్యాధికారి డాక్టర్ సుబ్బారావు, ఏవో నరసింహారావు, ఏఈవోలు కమలాకర్, భాగ్యలహరి, నవ్య, భవ్య తదితరులు పాల్గొన్నారు.

బోనకల్ తహసీల్దార్‌గా రమదేవి



బోనకల్, మే 19 (ఆంధ్రజ్యోతి): బోనకల్ మండల నూతన తహసీల్దార్‌గా ఎం.రమాదేవి సోమవారం బాధ్యతలను స్వీకరించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ రెవిన్యూ సేవలను అందిస్తానని ఆమె తెలిపారు. భూ సమస్యలకు సంబంధించి నిబంధనల మేరకు త్వరితగతిన పరిష్కరించేలా కృషి చేస్తానన్నారు. ప్రజలకు జవాబుదారీతనంగా ఉంటూ మండలాన్ని ఆదర్శంగా నిలిపేందుకు అందరిని సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతానని పేర్కొన్నారు.

పువ్వాళ్ల దంపతుల ప్రత్యేక పూజలు



ఏన్కూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ దంపతులు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. వీరివెంట మండలపార్టీ అధ్యక్షుడు స్వర్ణ నరేంద్రకుమార్, నాయకుల మేడా అప్పారావు లచ్చిరాంనాయక్, నరసింహారావు, నాగేశ్వరరావు తదితరులున్నారు.

ప్రజల ఆరోగ్యం రైతుల చేతుల్లో

- ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి



రైతులకు జీలుగులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

వేంసూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): పంటల సాగులో రసాయనాల వాడకం వల్లే ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుందని రైతులు రసాయనిక పురుగుమందుల వాడకాన్ని తగ్గించి సేంద్రీయ ఎరువుల వాడకాన్ని పెంచాలని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి సూచించారు. సోమవారం మండలంలోని భరణిపాడు గ్రామంలో రైతులకు జీలుగ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు పండించే పంటల్లో క్రిమిసంహారక మందులు వాడటం వల్ల ప్రజలు క్యాన్సర్, కిడ్నీ సంబంధిత వ్యాధుల బారీనపడుతున్నారని తెలిపారు. ప్రజల ఆరోగ్యం రైతుల చేతుల్లోనే ఉందని పేర్కొన్నారు. నాలుగు ఎకరాల వరకు రైతుభరోసా విడదల చేయడం జరిగిందని మిగిలిన ఎకరాలకు కూడా త్వరలోనే డబ్బులు జమచేయటం జరుగుతుందని రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. 50శాతం సబ్సిడీపై రైతులకు జీలుగు విత్తనాలను పంపిణీ చేయటం జరుగుతుందని ఏవో రామ్మోహన్‌రావు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సొసైటీ సీఈవో వెంకటేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు కూరపాటి నాని, కాంగ్రెస్ నాయకులు వెల్ది జగన్మోహన్‌రావు, కాసర చంద్రశేఖర్‌రెడ్డి, పుచ్చకాయల సోమిరెడ్డి, ఏఈవోలు పాల్గొన్నారు.

భార్యను వేధించిన భర్తకు మూడేళ్ల జైలు

- సత్తుపల్లి రూరల్ సీఐ ముత్తు

పెనుబల్లి, మే 19 (ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం కోసం భార్యను వేధించిన కేసులో భర్తకు మూడేళ్ల జైలుశిక్ష, రూ.పదివేల జరిమానా విధిస్తూ అడిషనల్ అసిస్టెంట్ సెషన్స్ న్యాయాధికారి వి.శివరంజని సోమవారం తీర్పునిచ్చారని సత్తుపల్లి రూరల్ సీఐ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ఏన్కూరు మండలం తూతిలింగన్నపేట గ్రామానికి చెందిన నామ నరేష్ అనే నిందితుడు పెళ్లైన రెండేళ్ల నుంచి అతని భార్య తేజశ్రీని అదనపు కట్నం కోసం నిత్యం మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురిచేస్తుండగా తట్టుకోలేక ఆమె 2019 జూన్ 9న ఆత్మహత్యకు పాల్పడిందని తండ్రి ఫిర్యాదు మేరకు ఏన్కూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి కోర్టులో అభియోపత్రం దాఖలు చేశామని తెలిపారు. సాక్ష్యాధారాలు, ఇరుపక్షాల వాదనలను పరిశీలించిన న్యాయమూర్తి నరేష్‌కు మూడేళ్ల జైలుశిక్ష, రూ.పదివేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారని సీఐ లింగయ్య తెలిపారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ పి.స్వప్న, ఎండీ.ఇజాద్ వాదించారు. ప్రాసిక్యూషన్‌కు ఏసీపీ రఘు, ఏన్కూరు అప్పటి ఎస్ఐ పవన్‌కుమార్, ప్రస్తుత ఎస్ఐ రఫీ, సీడీవో భారత్, లైజన్ అధికారులు కె.శ్రీకాంత్, డి.నాగేశ్వరరావు, హోంగార్డు శ్రీనివాస్‌లు కృషిచేయగా వారిని పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ అభినందించారని సీఐ లింగయ్య తెలిపారు.

ప్రజా ఉద్యమాలే సమస్యలకు పరిష్కారం

- వాడవాడలా పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి వేడుకలు
- ఆయన జీవితం త్యాగాలకు నిదర్శనం



సత్తుపల్లిలో పుచ్చలపల్లికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

సత్తుపల్లి/వైరా/బోనకల్/కొణిజర్ల/కల్లూరు/పెనుబల్లి, మే 19 (ఆంధ్రజ్యోతి): పుచ్చలపల్లి సుందరయ్య జీవితం ఎందరికో ఆదర్శమని, కుల వివక్షపై ఆయన పోరాడి తీరు ఎంతో అద్భుతమని పలువురు నాయకులు అన్నారు. సోమవారం సుందరయ్య 40వ వర్ధంతిని స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆ పార్టీ పట్టణ కార్యదర్శి కొలికపోగు సర్వేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు పార్టీ నాయకులు సుందరయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మోరంపూడి పాండురంగారావు, పట్టణ కమిటీ సభ్యులు మోరంపూడి వెంకట్రావు, చావా రమేష్, ఓలేటి శ్రీహరి, రాము, రత్నకుమారి, భాస్కర్‌లు పాల్గొన్నారు.

సుందరయ్య ఎప్పుడూ ప్రజల పక్షమే

స్వతంత్ర ఉద్యమం నుంచి తెలంగాణ సాయుధ పోరాటం వరకు ఆ తర్వాత పార్లమెంట్‌లో ప్రజాప్రతినిధిగా ప్రజల పక్షాన వారి సమస్యల పరిష్కారం కోసం అనేక సలహాలు, సూచనలు నెహ్రూ ప్రభుత్వానికి ఇచ్చిన గొప్ప మేధావి పుచ్చలపల్లి సుందరయ్య అని సీపీఎం రాష్ట్ర సీనియర్ నాయకుడు పి.సోమయ్య పేర్కొన్నారు. వైరా సీపీఎం కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సుందరయ్య 40వ వర్ధంతి వేడుకల్లో సోమయ్య ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పించారు.సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం, నాయకులు మేరుగు సత్యనారాయణ, సుంకర సుధాకర్, బాణాల శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ బొంతు సమత పాల్గొన్నారు.

సైకిల్‌పై పార్లమెంట్‌కు

కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య జీవితం త్యాగాలకు నిదర్శనమని సీపీఎం జిల్లా నాయకులు దొండపాటి నాగేశ్వరరావు, చింతలచెర్వు కోటేశ్వరరావులు కొనియాడారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో సోమవారం సుందరయ్య 40వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం మండల కార్యదర్శి కిలారు సురేష్, నాయకులు దొండపాటి సత్యనారాయణ, మచ్చా గురవయ్య, బందం శ్రీనివాసరావు, గుగులోతు నరేష్, బంకా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రైతాంగ సాయుధ పోరాట ఉద్యమసారథి

కమ్యూనిస్టు ఉద్యమనేత, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట ఉద్యమ రథసారథి పుచ్చలపల్లి సుందరయ్య అని సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం కొనియాడారు. మండల పరిధిలోని సీతారాంపురం, రెడ్డిగూడెం గ్రామాలలో సోమవారం జోనబోయిన అంజయ్య అధ్యక్షతన జరిగిన సుందరయ్య వర్ధంతిని నిర్వహించారు. జిల్లా నాయకులుతాళ్లపల్లి కృష్ణ, మండల కార్యదర్శి చెరుకుమల్లి కుటుంబరావు, ఉప్పర్ల రమేష్, ఉమాదేవి, శ్రీనివాసరావు, రామారావు, నాగయ్య, ఉపేందర్, పోల్‌రాజ్, రాము, అనంతకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అన్నీ వర్గాలకు ఆదర్శమూర్తి

మండల పరిధిలోని పలు గ్రామాల్లో సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో కమ్యూనిస్టు యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికంగా సిపిఎం కార్యాలయంలో డివిజన్ కమిటీ సభ్యులు తన్నీరు కృష్ణార్జునరావు ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు సందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసిఘన మైన నివాళులర్పించారు. నాయకులు ముదిగొండ్ల అంజయ్య, ఆర్ నాగేశ్వరరావు, వి రామనాథం, వెంకటి, బట్టు నరిసింహారావు, సామినేని హనుమంతరావు పుల్లయ్య తిగుళ్ల బాబు తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత

దక్షిణ భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి సభను సోమవారం వీఎంబంజర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు చలమాల విఠల్‌రావు మాట్లాడారు.సీపీఎం నాయకులు నలమల అరుణ్‌ప్రతాప్, తడికమళ్ల చిరంజీవి, రిటైర్డ్ ఉపాధ్యాయుడు, కవి గోపిశెట్టి వెంకటేశ్వరరావు, సీఐటీయూ నాయకులు మిద్దే స్వామి, బుడ్డియ్య, బొంతు మాధవరావు, చందు, యూటీఎఫ్ నాయకులు వెంకటరామారావు, తిరుపతిరావు పాల్గొన్నారు.

గీత పారాయణంలో వైదేహికి గోల్డ్‌మెడల్

ఏన్కూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): ఏన్కూరు మండలం తూతక్కలింగన్నపేట గ్రామానికి చెందిన కట్టా వైదేహి ఆదివారం మైసూరు దత్తపీఠాధిపతి శ్రీ గణపతి సచ్చిదానందస్వామి వారి చేతుల మీదుగా మైసూరులో బంగారు పతకం అందుకున్నారు. కర్ణాటక రాష్ట్రం మైసూరు శ్రీ గణపతి సచ్చిదానంద స్వామి దత్త పీఠం వారు నిర్వహించిన జాతీయస్థాయి ఆన్‌లైన్ భగవద్గీత కంఠస్థ పోటీల్లో వైదేహి 18 అధ్యాయాలు, 700 శ్లోకాలను అలవోకగా కంఠస్థం చేసి మార్చి 11న బంగారు పతకానికి ఎంపికైంది. గోల్డ్‌మెడల్ అందుకున్న వైదేహిని బాల వారాహి కమిటీ సభ్యులు తమన్న మురళి, టీడీపీ జిల్లా నాయకుడు కోపెల రామారావు మాజీ జడ్పీటీసీ కోపెల శ్యామల, మాజీ ఉప సర్పంచ్ వేముల రమేష్‌బాబు, కవిత తదితరులు అభినందించారు.

టీడీపీ బలోపేతమే లక్ష్యంగా పని చేస్తాం

బోనకల్, మే 19 (ఆంధ్రజ్యోతి): టీడీపీ బలోపేతమే లక్ష్యంగా పని చేస్తామని పార్టీ మండల అధ్యక్షుడు రావుట్ల సత్యనారాయణ, మండల ప్రదాన కార్యదర్శి కొంగర జగన్‌లు తెలిపారు. పార్టీ నూతన మండల కమిటీ ఎన్నిక కాగా సోమవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా మందుకు సాగుతామని పేర్కొన్నారు. తమను పార్టీ అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు.

శిక్షణను పకడ్బందీగా నిర్వహించాలి

బోనకల్, మే 19 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 20 నుంచి 24వ తేది వరకు మండల పరిధిలోని రావినూతల ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్న ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయుల వృత్యంతర శిక్షణను పకడ్బందీగా నిర్వహించాలని ఎంఈవో దామాల పుల్లయ్య సూచించారు. రావినూతల పాఠశాలలో సోమవారం శిక్షణకు సంబంధించి రిసోర్స్ పర్సన్లతో సమావేశాన్ని నిర్వహించారు. శిక్షణ ప్రతిరోజు ఉదయం 9:30 నుంచి సాయంత్రం 5 గంటలకు వరకు ఉంటుందని ఆయన అన్నారు. తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ యాప్‌లో హాజరును జియోట్యాగ్ చేయబడుతుందని తెలిపారు. ప్రతిరోజు ప్రీ, పోస్ట్ టెస్టులు తప్పని సరిగా రాయల్సి ఉన్నందున ఉపాధ్యాయులు శిక్షణ పై ప్రత్యేక దృష్టి సారించి విజయవంతం చేయాలని కోరారు.